శనివారం

28-10-2023

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 127

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

అసోం సీఎం శర్మకు ఈసీ నోటీసు

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ప్రచార సభలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత, అసోం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వ శర్మకు గురువారం కేంద్ర ఎన్నికల సంఘం నోటీసు జారీ చేసింది. ఛత్తీస్‌గఢ్‌లోని కవార్ధాలో ఈ నెల 18న జరిగిన ఎన్నికల ప్రచార సభలో హిమాంత శర్మ మాట్లాడుతూ..'ఒక చోటికి ఒక అక్బర్ వచ్చాడంటే అతడు మరో 100 మంది అక్బర్‌లను పిలుస్తాడు. అందుకే సాధ్యమైనంత త్వరగా అక్బర్‌ను పంపించివేయాలి. అలా చేయలేకపోతే కౌశల్య మాత పుట్టిన ఈ నేల అపవిత్రమవుతుంది' అంటూ రాష్ట్ర కేబినెట్‌లోని ఏకైక ముస్లిం మంత్రి మహ్మద్ అక్బర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు.

ఓటు ఉన్నట్టేనా?

ముసాయిదా జాబితా విడుదలతో ఓటర్లలో ఉత్కంఠ

ఏపీలో మొత్తం ఓటర్లు 4,02,21,450

డిసెంబరు 9వరకు అభ్యంతరాల స్వీకరణ

జనవరి 5న తుది జాబితా ప్రకటిస్తామన్న ఈసీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ప్రజల్లో గతంలో ఎన్నడూలేని విధంగా తమ ఓటు హక్కుపై తీవ్ర అభద్రతా భావం నెలకొంది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓట్లు తీసేశారని, ప్రతి నియోజకవర్గంలో అధికారపార్టీ 10 నుంచి 15వేలు దొంగ ఓట్లు చేర్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దాదాపు 27లక్షల ఓట్లపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాయి. కొన్ని నియోజకవర్గాల్లో అసలు ఇల్లు, డోర్ నెంబరు లేకుండానే ఆ ఇంట్లో పెద్దసంఖ్యలో ఓటర్లు ఉన్న విషయాన్ని ఆధారాలతో సహా ఈసీకి అందజేశారు. ఈ విధంగా అసంబద్ధ డోర్ నెంబర్లతో 2,51,767 ఓట్లు ఉన్నాయి. ఒకే డోర్ నెంబరులో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఇళ్ల సంఖ్య 1,57,939 ఉండగా... వాటిల్లో మొత్తం 24,61, 676 ఓట్లు నమోదై ఉన్నాయి. మరోవైపు అధికారపార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాల్లో తటస్థులు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన సానుభూతిపరులు, మద్దతు దారులకు సంబంధించిన లక్షల ఓట్ల తొలగింపునకు వైసీపీ నేతలు భారీ సంఖ్యలో ఫారం-7 దరఖాస్తులు పెట్టారు. టీడీపీకి పట్టున్న నియోజకవర్గాల్లో వేల సంఖ్యలో ఓట్లు తొలగించారు. దశాబ్దాల తరబడి ఒకే చిరునామాలో నివసిస్తున్న వారి పేర్లను ఆ ప్రాంత ఓటర్ల జాబితాల నుంచి తొలగించారు. అలాగే ఒకే కుటుంబానికి చెందిన ఓట్లను

- మిగతా 2 లో

మోదీ బ్లాక్ మెయిల్ రాజకీయాలు

రాజస్థాన్, తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ కుట్రలు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ : దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రధాని మోదీ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం సీహెచ్.కోటేశ్వరరావు అధ్యక్షతన ఇక్కడి దాసరి భవన్‌లో శుక్రవారం ప్రారంభమైంది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ, . దేశంలో ఐదు రాష్ట్రాల్లో జరుగనున్న ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తుందని అనేక సర్వేలు చెపుతున్నాయని తెలిపారు. మోదీ చేసే బ్లాక్‌మెయిల్ రాజకీయాలు కొత్తరూపు సంతరించుకుంటున్నాయని విమర్శించారు. ఈ రాజకీయాల వల్ల ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా పలస్తీనా విషయంలో మోదీ ద్వంద్వ వైఖరి అవలంబించటం సరికాదన్నారు. ఇక దేశంలో ఇండియా కూటమి సమన్వయ కమిటీ, సోషల్ మీడియా, ప్రచార కమిటీలు ఏర్పాటు చేసిన తరువాత బీజేపీలో ఓటమి భయం కనబడుతున్నదన్నారు. అజెండా ఏమీ లేకుండా పార్లమెంటు అత్యవసర సమావేశాలు ఏర్పాటుచేసి జమిలీ ఎన్నికలంటూ అనధికార ప్రచారం చేశారన్నారు. మహిళా బిల్లు అందని ద్రాక్షగా మార్చారని అది కేవలం ఎన్నికల జిమ్మిక్కుగా అభివర్ణించారు. ఇండియా పేరును భారత్‌గా మార్చటం కోసం ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌ను మారుస్తున్నారని చెప్పారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ అనేక అక్రమాలకు, అవకతవకలకు పాల్పడుతున్నదన్నారు. బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్న రాజస్థాన్ సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో తన బలాన్ని పెంచుకునేందుకు రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నదని విమర్శించారు. రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి కుమారుడిపై అవినీతి బురద జల్లుతున్నారని చెప్పారు. తెలంగాణలో పరీక్ష పేపర్ల లీకేజీల నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ మూడుసార్లు జైలుకెళ్లాల్సిన సందర్భాలు వచ్చాయన్నారు. రాజకీయ ప్రత్యర్థులు బలంగా ఉంటే వారిపై కేసులు పెడుతున్నారని విమర్శించారు. దిల్లీ లిక్కర్ స్కాంలో మద్యం అమ్మినవారు, కమీషన్‌లు తీసుకున్నవారు బయటే ఉన్నారని ఆ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన మనీశ్ సిసోడియా మాత్రం జైల్లో ఉన్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏపీలోని కోస్తా తీరప్రాంతాన్ని పబ్లిక్, ప్రైవేటు ఆస్తిగా మార్చిందన్నారు. తదనుగుణంగా శ్రీకాకుళంలో తీరప్రాంతానికి టెండర్లు పిలిచారని, శ్రీకాకుళం బీచ్ శాండ్ మైనింగ్‌ను ప్రైవేట్ కంపెనీకి అప్పగించారని తెలిపారు. లాభాల్లో ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించవద్దని ఉద్యమాలు చేస్తున్నా లెక్కచేయటం లేదన్నారు. మోదీ హయాంలో ఒక్క ప్రభుత్వరంగ సంస్థను నెలకొల్పలేదని, ఉన్న వాటిని ప్రైవేటీకరిస్తున్నారని చెప్పారు. మోదీ ప్రభుత్వం కర్నాటకలో జై భజరంగ్ నినాదం, తమిళనాడులో సనాతన ధర్మంపై ప్రచారం చేసున్నదని, బెంగాల్‌లో ఈడీతో దాడులు చేయిస్తున్నదన్నారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పుంజుకుంటోందని తెలిపారు. ఎన్నికల కమిషన్, సీబీఐ, ఈడీలను కేంద్రం తన చేతుల్లో పెట్టుకుందని, రాష్ట్రపతిని నామమాత్రంగా మార్చేసిందని విమర్శించారు.

ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుతో బీజేపీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు అర్థం అవుతాయన్నారు. బీజేపీ, అమిత్ షా అనుమతి లేకుండా జగన్ ఒక్కరే చంద్రబాబును అరెస్టు చేయించలేరని చెప్పారు. కేసీఆర్, జగన్ దిల్లీ వెళ్లి లాబీయింగ్ చేసుకుంటారన్నారు. అందువల్ల కేసీఆర్ కుమార్తె కవిత అరెస్టు కాలేదని, హత్య కేసులో నిందితునిగా ఉన్న అవినాశ్ రెడ్డి అరెస్టు కారని, అవినీతి కేసుల్లో నిందితునిగా ఉన్న జగన్ బెయిల్‌పై ఉంటారని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీ టీడీపీని లౌకికపార్టీగా గుర్తిస్తుందన్నారు. సీపీఐని కలుపుకుంటే మోదీకి కోపం వస్తుందని చంద్రబాబు భయపడుతున్నారని చెప్పారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ పాలనకు వ్యతిరేకంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమం విజయవంతం అయిందన్నారు. అదే విధంగా సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. బస్సుయాత్రను జయప్రదం చేసిన పార్టీ శ్రేణులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తొలుత సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి ఇటీవల మరణించిన వారికి సంతాపం తెలుపుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షులు చంద్రానాయక్ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

రాష్ట్ర పండుగగా 'నవంబరు 1'

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జీఏడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముత్యాల రాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో నవంబర్ 1న ఉదయం 10 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నివాళు లర్పించనున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గవర్నర్, ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు సందేశాలివ్వనున్నారు. జిల్లా స్థాయిలో

- మిగతా 2 లో

ఎగవేత రోజుకు వంద కోట్లు

▸ 2019 మార్చి నుంచి ఇదే పరిస్థితి

▸ ఇప్పటి వరకు బకాయి రూ.1.2 లక్షల కోట్లు : నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: జూన్ 2023 నాటికి ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నుంచి రావాల్సిన బకాయి మొత్తం 50 శాతం కంటే ఎక్కువ పెరిగి 3 ట్రిలియన్లకు చేరుకుంది. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు రూ.10 లక్షల కోట్ల మొత్తాన్ని రద్దు చేశాయని ఆగస్టులో పార్లమెంటులో ప్రభుత్వం తెలిపింది. మార్చి 2019 నుంచి ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నుంచి రావాల్సిన బకాయి మొత్తం రోజుకు రూ.100 కోట్లకు పైగా పెరిగింది. బిజినెస్ స్టాండర్డ్ నివేదిక ప్రకారం, ఉద్దేశపూర్వక ఎగవేతదారుల నుంచి చెల్లించాల్సిన మొత్తం కనీసం అప్పటి నుంచి 1.2 ట్రిలియన్లు లేదా రూ.1.2 లక్షల కోట్లు పెరిగింది. ఉద్దేశపూర్వక ఎగవేతదారుడు అనేది రుణం చెల్లించగల సామర్థ్యం ఉన్నప్పటికీ, తిరిగి చెల్లించని రుణగ్రహీతల కోసం ఉపయోగించే నిర్దిష్ట పదం.

అయితే కష్టాల్లో ఉన్న రైతు వంటి చిన్న రుణగ్రహీతలను ఇది సూచించదు. గత యూపీఏ ప్రభుత్వం 'కుంభకోణాలతో' బ్యాంకింగ్ రంగాన్ని 'నాశనం' చేయడంపై ప్రధాన మంత్రి మోదీ వాదించారు. బిజినెస్ స్టాండర్డ్ నివేదిక ట్రాన్స్ యూనియన్ సిబిల్ ఆధారంగా రూపొందించబడింది. ఈ సమాచారం వివిధ ఆర్థిక సంస్థలచే తరచూ జరిగే వాటితో నవీకరించబడుతుంది. గణాంకాలు

- మిగతా 2 లో

నాకు భద్రత లేదు

ఏసీబీ కోర్టు జడ్జికి చంద్రబాబు లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జైల్లో ఉన్న తనకుగానీ, బయట ఉన్న తన కుటుంబానికిగానీ భద్రత లేదని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆయన ఈనెల 25న ఏసీబీ కోర్టు జడ్జికి మూడు పేజీల లేఖ పంపారు. జైల్లో తన భద్రత, ఆరోగ్యంపై అందులో అనుమానాలు వ్యక్తం చేశారు. లేఖలో చంద్రబాబు ఇలా రాశారు.

'నాకు జెడ్ ప్లస్ భద్రత ఉంది. జైలుకు వచ్చినప్పుడు అనధికారికంగా నన్ను వీడియోలు, ఫొటోలు తీశారు. ఆ ఫుటేజ్‌ను పోలీసులే లీక్ చేశారు. నా ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వీడియోలు విడుదల చేశారు. నన్ను అంతం చేసేందుకు వామపక్ష తీవ్రవాదులు కుట్ర పన్నుతున్నారు. దీని గురించి తూర్పు గోదావరి జిల్లా ఎస్పీకి లేఖ కూడా వచ్చింది. ఆ లేఖపై ఇప్పటి వరకు పోలీస్ అధికారులు విచారణ చేపట్టలేదు. రాజమండ్రి సెంట్రల్ జైలులో నా భద్రతపై అనుమానాలు న్నాయి. ఎస్ కోటకి చెందిన ఓ ముద్దాయి జైల్లో పెన్ కెమెరాతో విజువల్స్ తీస్తున్నారని తెలిసింది. నా కదలికలు కనిపెట్టేందుకు జైలుపై అనధికారికంగా డ్రోన్లు ఎగరేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారే ఈ డ్రోన్లు ఎగరేశారని భావిస్తున్నాను. డ్రోన్లు ఎగరేసిన ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు. ఆ సూత్రధారి ఎవరో ఇంతవరకు గుర్తించలేదు. ఈనెల 6న నన్ను కలవడానికి నా కుటుంబసభ్యులు వచ్చిన సందర్భంలో సెంట్రల్ జైలు ప్రధాన ద్వారం వద్ద మరో డ్రోన్ ఎగరేశారు. నాకు మాత్రమే కాదు నా కుటుంబ సభ్యులకూ ప్రమాదం పొంచి ఉందనే ఆందోళన కలుగుతోంది. కొందరు గంజాయి ప్యాకెట్లు జైలు ప్రాంగణంలో విసిరారు. గార్డెనింగ్ విధుల్లోని ఖైదీలు వాటిని పట్టుకున్నారు. రాజమహేంద్రవరం జైలులో 2,200 మంది ఖైదీలున్నారు. వారిలో 750 మంది డ్రగ్స్ కేసు నిందితులు. వీరిలో కొంతమంది ఖైదీల వల్ల నా భద్రతకు ముప్పు

- మిగతా 2 లో

చంద్రబాబు బెయిల్ పిటిషన్ 31కి వాయిదా

'నాట్ బిఫోర్ మీ' అంటూ వైదొలిగిన న్యాయమూర్తి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది.ఈ పిటిషన్ విచారణ నుంచి న్యాయమూర్తి వైదొలిగారు. ఈ పిటిషన్ దసరా సెలవుల ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు రాగా 'నాట్ బిఫోర్ మీ' అంటూ న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారణ నుంచి తప్పుకున్నారు. చంద్రబాబు తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాదుల జాబితాలో కొత్తగా జీవీఎల్ మూర్తి ఉన్నారు. ఆయన జ్యూడీషియల్ అధికారి కుటుంబ సభ్యుడు కావటంతో తాను ఈ కేసు విచారణ చేయలేనని న్యాయమూర్తి నాట్ బిఫోర్ మీ చెప్పినట్లు తెలుస్తోంది. ఈ కేసు విచారణ ఏ బెంచ్‌కు బదిలీ చేస్తారనేది

- మిగతా 2 లో

ఇదీ లోకం!

చైనా మాజీ ప్రధాని లీ కియాంగ్ మృతి

బీజింగ్: చైనా మాజీ ప్రధాని, చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) 17, 18, 19వ పొలిట్ బ్యూరో సభ్యుడు లీ కియాంగ్ (68) కన్నుమూశారు. గురువారం అర్థరాత్రి 12.10 గంటలకు షాంఘైలో తుదిశ్వాస విడిచారు. గుండెపోటుకు గురైన ఆయనను కాపాడే ప్రయత్నాలు ఫలించలేదని సీసీటీవీ నివేదించింది. లీ కియాంగ్ మృతిని చైనా కమ్యూనిస్టు పార్టీ ధ్రువీకరించింది. నిబద్ధతగల

- మిగతా 2 లో

పలస్తీనాకు సంఘీభావంగా సీపీఐ కొవ్వొత్తుల ర్యాలీ

2లో

భారత దళాలు వెనక్కి వెళ్లాల్సిందే

మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు

మాలే: మాల్దీవులు పూర్తిగా స్వతంత్రంగా ఉండాలని భావిస్తోందని ఇందుకోసం భారత దళాలు వెనక్కి వెళ్లిపోవాలని నూతన అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు స్పష్టంచేశారు. హిందూ మహా సముద్ర ప్రాంతంలో వ్యూహాత్మకంగా పట్టు సాధించడం కోసం మాల్దీవుల్లో తమ ఉనికిని పెంచుకోవడానికి కొంత కాలంగా భారత్, చైనా దేశాలు పోటీ పడుతున్నాయి. ఇంతకుముందు మాల్దీవుల అధ్యక్షుడిగా ఉన్న ఇబ్రహీం సోలిహ్ 'ఇండియా ఫస్ట్' నినాదంతో భారత్‌తో సత్సంబంధాలు పెట్టుకున్నారు. తాజా ఎన్నికల్లో ఆయనను ఓడించి ముయిజ్జు అధ్యక్ష పగ్గాలు చేపట్టారు. ఈయన చైనాకు అనుకూలం. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇబ్రహీం సోలిహ్‌పై ముయిజ్జు తీవ్ర విమర్శలు చేశారు. భారతకు మాల్దీవుల సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టేశారని దుయ్యబట్టారు. తమ గడ్డపై భారత్‌తోపాటు మరే ఇతర దేశానికి చెందిన సైన్యం అవసరం లేదన్నారు. భారత సైనికులను మాల్దీవుల్లోకి అనుమతించి వారికి నియంత్రణ లేకుండా అధికారాలను ఇచ్చారని ముయిజ్జు తీవ్రస్థాయిలో ఇబ్రహీనం సోలిహ్‌పై విమర్శలు గుప్పించారు. కాగా, ముయిజ్జు నవంబర్ 15న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మరోవైపు భారత్-మాల్దీవుల మధ్య సత్సంబంధాలు ఉండటంతో మాల్దీవులకు వైద్య, ఆర్థిక సాయాన్ని అందించింది. ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతం అందించేందుకు 2018లో 1.4 బిలియన్ డాలర్ల (రూ.11.6 కోట్ల) ప్యాకేజీ అందించింది. 2020లో మాలేను పొరుగు ద్వీపాలకు అనుసంధానించే వంతెనలు, కాజ్‌వేలను నిర్మించడానికి 500 మిలియన్ డాలర్లు అంటే రూ.4వేల కోట్లు ఇచ్చింది. తాజా పరిణామాల క్రమంలో ముయిజ్జు ఎన్నిక భారత్‌కు ఎదురు దెబ్బగా పరిణమించింది.

సిరియాపై అమెరికా వైమానిక దాడులు

ఆత్మరక్షణ కోసమేనని ప్రకటన

మాజోలికి రావొద్దు: ఇరాన్‌కు బైడెన్ హెచ్చరిక

వాషింగ్టన్: ఇజ్రాయిల్-హమాస్ మధ్య మొదలైన దాడుల క్రమంగా తీవ్ర రూపం దాల్చుతూ పశ్చిమాసియాకు వ్యాపిస్తున్నాయి. శుక్రవారం సిరియాలోని రెండు ఆయుధగారాలపై ఎఫ్16 యుద్ధ విమానాలతో అమెరికా దాడులు చేసింది. ఇది ఆత్మరక్షణలో భాగమని ప్రకటించుకుంది. ఇరాన్ అండగల మిలీషియా...ఇరాక్, సిరియాలోని తమ దళాలపై జరుపుతున్న దాడులకు ప్రతిస్పందనగా అమెరికా రక్షణ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్ ఓ ప్రకటన చేశారు. అమెరికా దళాలపై దాడులు ఆక్షేపణీయమని, వాటిని ఆపేయాలన్నారు. పశ్చిమాసియాలోని అమెరికా దళాలను లక్ష్యంగా చేసుకోవడాన్ని మానేయాలని ఇరాన్ అధినేత అయాతుల్లా అలీ ఖమేనీని హెచ్చరిస్తూ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఓ సందేశం పంపినట్లు శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి. తాజాగా ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, మిలీషియా గ్రూపులు వినియోగించే రెండు స్థావరాలపై దాడులకు బైడెన్ ఆదేశాలిచ్చినట్లు పెంటగాన్ తెలిపింది. ఇరాన్ వైపు నుంచి దాడులు ఆగకపోతే ఉపేక్షించేది లేదని హెచ్చరించింది. వారం రోజుల్లో ఇరాన్ మద్దతున్న దళాలు సిరియా, ఇరాక్‌లోని అమెరికా, దాని అనుబంధ దళాలపై 19సార్లు దాడులు చేసినట్లు అమెరికా వర్గాలు తెలిపాయి. హమాస్, ఇస్లామిక్ జిహాద్, లెబనాన్‌కు చెందిన హెజ్బుల్లాకు టెహ్రాన్ అండదండలు ఉన్నాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి హుస్సేన్ అమిరాబ్దుల్లాహియన్ గురువారం ఐరాసలో మాట్లాడుతూ హమాస్‌పై ఇజ్రాయిల్ దాడులు ఆగకపోతే అమెరికా కూడా దాడుల నుంచి తప్పించుకోలేదని అన్నారు. కాగా శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఇరాక్-సిరియా సరిహద్దు పట్టణమైన అబు కమల్ సమీపంలో అమెరికా వైమానిక దాడులు జరిగాయి. రెండు ఎఫ్-16 ఫైటర్ జెట్లను ఈ దాడులకు వినియోగించినట్లు అమెరికా రక్షణాధికారి వెల్లడించారు.

దేశ సేవలో ఐపీఎస్‌లు శక్తివంచన లేకుండా కృషి చేయాలి

హోంమంత్రి అమిత్ షా

విశాలాంధ్ర-హైదరాబాద్: దేశ సేవలో ఐపీఎస్‌లు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. పీడిత ప్రజల అభ్యున్నతి, వారి భద్రత కోసం ఐపీఎస్‌లు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా నేడు దేశంలో వివిధ రకాల వ్యవస్థీకృత నేరాలు సవాళ్లు విసురుతున్నాయన్నారు. ప్రధానంగా సైబర్ నేరాల అదుపు, నేరగాళ్లకు చెక్ పెట్టడంలో టెక్నాలజీపై ఐపీఎస్‌లు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. హవాలా, నకిలీ నోట్ల కట్టడికి గట్టిగా పోరాడాలన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని నేషనల్ పోలీస్ అకాడమీలో నూతన ఐపీఎస్‌ల పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. గవర్నర్ తమిళిసై, డీజీపీ అంజనీ కుమార్ సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ 75వ బ్యాచ్ ఐపీఎస్ శిక్షణలో 33 మంది మహిళా ఐపీఎస్ లు ఉండడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే ఎన్నో సవాళ్లను ఐపీఎస్ లు అలవోకగా ఎదుర్కోవాలని సూచించారు. సైబర్ క్రైమ్, క్రిప్టో కరెన్సీ, హవాలా, నకిలీ నోట్లు, నార్కోటిక్స్, ఇంటర్ స్టేట్ గ్యాంగ్, చార్జిషీట్ ఫైల్, ఫోరెన్సిక్ సైన్స్ ఇలా అన్ని అంశాలపై ఐపీఎస్ లు పట్టు సాధించాలని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా క్రిమినల్ జస్టిస్ పై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అంతిమంగా ఐపీఎస్ లు భద్రత అందించడంలో ప్రజల మనసులు గెలవాలని తెలిపారు. ఈ 25 ఏళ్ల (అమృత్‌కాల్) మన తీర్మానాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నేతృత్వంలో అన్ని రంగాల్లో దేశం ముందుకెళ్తోందని, ఆంగ్లేయుల కాలం నాటి 3 చట్టాలను మార్చాల్సి ఉందన్నారు. సీఆర్‌పీసీ, ఐపీసీ, ఎవిడెన్స్ చట్టాల్లో మార్పులు చేసి ప్రభుత్వం పార్లమెంట్ ముందు ఉంచిందన్నారు. త్వరలో నేర చట్టాల బిల్లు ఆమోదం పొందుతుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రజల హక్కులను సురక్షితంగా ఉంచడం కొత్త చట్టాల ఉద్దేశమని, కొత్త చట్టాల ఆధారంగా అధికారులు ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు. అంతకుముందు నూతన ఐపీఎస్‌ల నుంచి అమిత్ షా గౌరవ వందనం స్వీకరించారు.

నేషనల్ పోలీస్ అకాడమీలో 175 మంది ట్రైనీ ఐపీఎస్‌లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇండియన్ ట్రైనీ ఐపీఎస్ లు 155, మరో 20 మంది ఫారిన్ ఆఫీసర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. 102 వారాలు పాటు శిక్షణ పూర్తి చేయాల్సి ఉండగా అందులో ట్రైనీలు మొదటి దశ పూర్తి చేసుకున్నారు. 75 మంది ఉన్న ఐపీఎస్ బ్యాచ్ లో 34 మంది మహిళ ట్రైనీ ఐపీఎస్‌లు ఉన్నారు. వారిలో 32 మంది ఇండియన్ ట్రైనీలు కాగా ఇద్దరు విదేశీయులు. ట్రైనీ ఐపీఎస్‌లలో తెలంగాణకు 9 మంది, ఏపీకి ఐదుగుర్ని కేటాయించడం జరిగింది. తెలంగాణకు ముగ్గురు మహిళ ఐపీఎస్‌లు, ఏపీకి ఒక మహిళ ఐపీఎస్‌ను కేటాయించారు. 155 మందిలో 102 మంది ట్రైనీ ఐపీఎస్‌లు ఇంజనీరింగ్ నేపథ్యం కలిగిన వారు కావడం విశేషం. 25 ఏళ్లలోపు కలిగిన ట్రైనీ లు తొమ్మిది మంది ఉన్నారు.

గడువులోగా మా దేశాన్ని వీడండి

లేకపోతే అరెస్టు చేస్తాం : అఫ్ఘాన్ శరణార్థులకు పాక్ హెచ్చరిక

ఇస్లామాబాద్: తమ దేశంలో అనధికారికంగా ఉంటున్న అఫ్గాన్లను వెళ్లిపోవాలంటూ పాకిస్తాన్ ఆదేశాలిచ్చింది. తమ దేశాన్ని వీడేందుకు వారికి నవంబరు ఒకటో తేదీ వరకు గడువు ఇచ్చింది. డెడ్‌లైన్ నాటికి వెళ్లకపోతే అరెస్టు చేస్తామని హెచ్చరించింది. గడువును పొడిగించే ప్రసక్తి లేదని తేల్చిచెప్పింది. 'నవంబరు 1వ తేదీ లోపు అంతా వెళ్లిపోవాలి. లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. గడువు ముగిసిన తర్వాత పాక్‌లో ఉన్న అఫ్గాన్ వాసులను అరెస్ట్ చేస్తాం' అని పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాలశాఖ మంత్రి సర్ఫరాజ్ బుగ్తీ స్పష్టం చేశారు. అయితే పాకిస్తాన్ తీరును ఐక్యరాజ్యసమితి తప్పుపట్టింది. ఇది మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుందని అఫ్గాన్ ప్రజలను వెళ్లగొట్టడంపై ఆందోళన వ్యక్తం చేసింది. దాదాపు 17 లక్షలకుపైగా అఫ్గాన్ శరణార్థులను బలవంతంగా స్వదేశానికి తరలించేందుకు పాకిస్తాన్ గడువు విధించడం, హెచ్చరికలు చేయడాన్ని ఐక్యరాజ్యసమితి ఖండించింది. పాక్ చర్యల వల్ల కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయని, చిన్నపిల్లపైనా తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించింది. అయినా పాకిస్తాన్ వెనక్కి తగ్గకపోవడం గమనార్హం.

చంద్రబాబు బెయిల్ పిటిషన్ 31కి వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

రిజిస్ట్రార్ నిర్ణయం తీసుకుంటారని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ కేసులో ఏసీబీ కోర్టు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంతో చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ నెల 19న హైకోర్టు ఈ పిటిషన్‌పై విచారణ జరిపి వెకేషన్ బెంచ్ ముందుకు వాయిదా వేసింది. తాజాగా ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది.

సీఐడీ అధికారుల కాల్ డేటా అంశంపై 31న తీర్పు

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు సమయంలో అక్కడున్న సీఐడీ అధికారుల కాల్‌డేటా రికార్డు ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. రెండు వర్గాల తరఫున వాదనలు విన్న న్యాయమూర్తి పిటిషన్‌పై వాదనలను ముగించారు. అనంతరం తీర్పును రిజర్వ్ చేశారు. ఈ నెల 31న తీర్పు ఇవ్వనున్నట్లు ఏసీబీ కోర్టు వెల్లడించింది. చంద్రబాబును అరెస్టు చేసే సమయానికి ముందు సీఐడీ అధికారులు కొందరిని ఫోన్ ద్వారా సంప్రదించారని, ఆ వివరాలు తెలిస్తే అరెస్టులో కీలక విషయాలు బయట పడతాయని చంద్రబాబు తరపు న్యాయవాది గత విచారణ సందర్భంగా వాదించిన విషయం తెలిసిందే.

రాష్ట్ర పండుగగా 'నవంబరు1'

(మొదటిపేజీ తరువాయి)

అవతరణ దినోత్సవాన్ని నిర్వహించేందుకు కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దిల్లీలోని ఏపీ భవన్‌లో కూడా అవతరణ దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించారు. అవతరణ దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలంటూ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో అవతరణ దినోత్సవానికి బదులుగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వారం రోజులపాటు నవనిర్మాణ దీక్షలు చేపట్టారు. రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించినందున ప్రతి ఒక్కరూ రాష్ట్ర నవనిర్మాణానికి పూనుకోవాలంటూ దీక్షల్లో ఆయన విజ్ఞప్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా రద్దు చేసి నవంబరు 1న రాష్ట్ర అవతరణ దినోత్సవంగా జరుపుతోంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఈసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతోంది.

చైనా మాజీ ప్రధాని లీ కియాంగ్ మృతి

(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనిస్టుగా కియాంగ్‌ను శ్లాఘిస్తూ నివాళి అర్పించింది. సీపీసీ కేంద్ర కమిటీ, నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ స్టాండింగ్ కమిటీ, స్టేట్ కౌన్సిల్, ది నేషనల్ కమిటీ ఆఫ్ ది చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్ టేటివ్ కాన్ఫరెన్స్ సంతాపం ప్రకటించాయి. దశాబ్దం పాటు చైనా అగ్రనేతగా కొనసాగిన కియాంగ్ పది నెలల కిందటే రిటైర్ అయ్యారు. చైనా సామాజిక మాధ్యమాల ద్వారా కియాంగ్ మృతికి సంతాపలు వెల్లువెత్తాయి. వెయిబో మైక్రోబ్లాకింగ్ వేదిక తన లైక్ బటన్‌ను 'మోర్న్' (విచారానికి సంకేతమైన పువ్వు గుర్తు)గా మార్చింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా కియాంగ్ మృతికి సంతాపం తెలిపారు. జిన్‌పింగ్ నాయకత్వంలో లీ కియాంగ్ కీలక పదవులను చేపట్టారు. కియాంగ్ మృతితో ఓ శకం ముగిసిందని చైనా మేధావులు, ప్రగతిశీలవాదులు కొందరు వ్యాఖ్యానించారు. ఆర్థిక సంస్కరణకర్తగా ఆయనను వర్ణించారు. చైనా రాజకీయాల్లో లీ కియాంగ్ వంటి వారు మరొకరు లేరని లీ కౌన్ య్యూ స్కూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆల్ఫ్రెట్ వ్యూ, ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన వెన్ టి సంగ్ పేర్కొన్నారు. ఆయన ఉంటే ఎలాంటి సంస్కరణలు జరిగివుండేవో అని కియాంగ్‌ను గుర్తుచేసుకుంటారని తెలిపారు. లీ కియాంగ్ తూర్పు చైనాలోని అన్‌హ్యూ ప్రావిన్స్‌లో జన్మించారు. అది పేద వ్యవసాయ క్షేత్రం, అక్కడి అధికారిగా కియాంగ్ తండ్రి ఉండేవారు. సాంస్కృతిక విప్లవం సమయంలో ఈయన పొల్లాల్లో పనిచేశారు. ప్రసిద్ధ పెకింగ్ యూనివర్సిటీ నుంచి లా పట్టా పొందారు. గ్రాడ్యుయేషన్ తర్వాత కమ్యూనిస్టు పార్టీ యూత్ లీగ్‌లో చేరారు. పార్టీలో క్రియాశీలంగా ఉంటూనే లాలో మాస్టర్స్ చేశారు. ఆపై ఎకనామిక్స్ డాక్టరేట్ అందుకున్నారు. విపణి సంస్కరణలపై పట్టుసాధించారు. అలాగే మంచి రాజకీయ అనుభవాన్ని సాధించారు. లియాంనింగ్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఆధునిక పారిశ్రామిక వాడగా ఆ ప్రాంతాన్ని తీర్చిదిద్దారు. ఆర్థిక సంస్కరణకర్తగా అందరి మన్ననలు పొందారు. లీ కియాంగ్ ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడగలరు. కియాంగ్ భార్య చెంగ్ హాంగ్ (ఆంగ్ల ప్రొఫెసర్), వీరికి ఓ కుమార్తె ఉన్నారు.

నిజం గెలవడం కోసమే పోరాటం

నారా భువనేశ్వరి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి : నిజం గెలవడం కోసమే తాను పోరాటం చేస్తున్నానని... ప్రజల అండే తెలుగుదేశం పార్టీకి శ్రీరామ రక్ష అని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో శుక్రవారం 'నిజం గెలవాలి' సభ నిర్వహించారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా భువనేశ్వరి సభను ఉద్దేశించి ప్రసంగించారు. తాను ఇక్కడ చంద్రబాబు నాయుడు భార్యగానే కాకుండా భారత నారీగా నిజం గెలవాలని మీ ముందుకు తీసుకు వస్తున్నానని అన్నారు. ఈ పోరాటం తనదొక్కటే కాదని... ఈ పోరాటం ప్రజలందరిదీనని ఆమె గుర్తు చేశారు. 'నిజం గెలవాలి' పేరుతో తాను మూడు రోజులుగా నిర్వహిస్తున్న సభలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడూ ప్రజలు, రాష్ట్ర అభివృద్ధి గురించి ఆలోచస్తూ ఉంటారన్నారు. అలాంటి వ్యక్తిని అక్రమంగా నిర్బంధించి నేటికి 49 రోజులు అయిందన్నారు. అయినా ఇంత వరకు వైసీపీ ప్రభుత్వం రుజువులు నిరూపించలేక పోయిందన్నారు. చంద్రబాబు అవినీతికి పాల్పడలేదని వారికి తెలుసన్నారు. ముందు రూ.3 వేల కోట్లు అన్నారని... ఆ తరువాత రూ.70 కోట్లు అన్నారని... ఇపుడేమో రూ.27 కోట్లు అంటున్నారని... ఇందులో ఏది నిజమో ప్రభుత్వమే చెప్పాలని భువనేశ్వరి నిలదీశారు. ఇది ప్రభుత్వం చేసే అరాచకం అన్నారు. చంద్రబాబు నాయుడు అభివృద్ధి చేయడం తప్పా అని ఆమె ప్రశ్నించారు. నిరుద్యోగ సమస్య తీర్చడానికి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేశారన్నారు. చంద్రబాబు హయాంలో ఏపీ అంటే అభివృద్ధి అనే వారని... ఇపుడు ఏపీ అంటే అన్నదాతల ఆత్మహత్యలని... గంజాయి విక్రయాలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు, భూ దందాలు, సెటిల్‌మెంట్ల కేంద్రంగా మారిపోయిందని భువనేశ్వరి అన్నారు. ఏపీలో నేడు కమీషను కోసం కంపెనీలను వెళ్లగొడుతున్నారని, కరెంటు బిల్లులు గురించి అడిగితే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. జగన్ కారణంగా ఏపీ రాజధాని లేని రాష్ట్రంగా మారిపోయిందన్నారు. శ్రీకాళహస్తి, పుంగనూరు ఘటనలు గురించి ప్రజలందరికీ తెలుసని... రాష్ట్రంలో ఎలా అరాచక పాలన జరుగుతోందో ఈ సంఘటనలే నిదర్శనమన్నారు. రాజ్యాంగం ఎంత గొప్పది అయినా దానిని అమలు చేసే వారు మంచి వారు కాకపోతే... మంచి జరగదని అన్నారు. వైసీపీ ప్రభుత్వం పని అయిపోయిందని భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు తప్పకుండా బయటకు వచ్చి ప్రజల కోసం కష్టపడతారన్నారు. 2024లో జరిగే కురుక్షేత్ర యుద్ధంలో తెలుగుదేశం-జనసేన పార్టీలు విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. 'నిజం గెలవాలి'... 'నిజమే గెలవాలి'... 'సత్యమేవ జయతే' అంటూ భువనేశ్వరి నినదించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పనబాక లక్ష్మి, అమరనాథరెడ్డి, వంగలపూడి అనిత, ఎమ్మెల్సీలు అనురాధ, రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, పులివర్తి నాని, నరసింహ యాదవ్, బొజ్జల సుధీర్ రెడ్డి, బొజ్జల బృందమ్మ, ఎస్సీవీ నాయుడు, జనసేన నాయకులు హరి ప్రసాద్, కోట వినుత తదితరులు పాల్గొన్నారు.

పలస్తీనాకు సంఘీభావంగా సీపీఐ కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర-విజయవాడ: సామ్రాజ్యవాద దేశం అమెరికా ప్రోత్సాహంతోనే పలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. ఇజ్రాయిల్ దాడుల్లో అల్లాడిపోతున్న పలస్తీనా ప్రజలకు సంఘీభావంగా శుక్రవారం సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీని ఆయన ప్రారంభించారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్ నుంచి హనుమాన్‌పేటలోని కారల్‌మార్క్స్, ఏంగేల్స్ విగ్రహాల వరకు ఈ ర్యాలీ జరిగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఇజ్రాయిల్ దాడుల వెనుక అమెరికా ప్రోత్సాహం ఉందన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాని మోదీ కూడా పలస్తీనాపై ద్వంద్వ వైఖరి అవలంబించడం విచారకరమన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ నాగరిక సమాజంలో మానవ హననం చేస్తూ దాడులు చేయటం మంచిపద్ధతి కాదన్నారు.

ఇజ్రాయిల్ దాడుల్ని తీవ్రంగా ఖండించారు. ప్రపంచ దేశాల నుంచి నిరసనలు వస్తున్నా పట్టించుకోకుండా ఇజ్రాయిల్ ఏకపక్షంగా దాడులకు తెగబడటం దారుణమన్నారు. అలీన దేశాలకు నాయకత్వం వహించిన భారతదేశం పలస్తీనాలో శాంతి నెలకొల్పటానికి కృషి చేయాలని కోరారు. పలస్తీనాకు సంఘీభావంగా రానున్న రోజుల్లో సెక్యూలర్ పార్టీలు, ప్రజాసంఘాలను కలుపుకుని ర్యాలీలు, సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జి.ఓబులేసు, పి.హరినాథరెడ్డి, గుజ్జుల ఈశ్వరయ్య, అక్కినేని వనజ, పి.రామచంద్రయ్య, జంగాల అజయ్‌కుమార్, డేగా ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు టి మధు, ఆర్.రవీంద్రనాథ్, ఆవుల శేఖర్, సీహెచ్.కోటేశ్వరరావు, ఎ.మారుతీ వరప్రసాద్, దోనేపూడి శంకర్, ఎన్ లెనిన్‌బాబు, కె శివారెడ్డి, వి జాన్సన్‌బాబు, బాలేపల్లి వెంకట రమణ, ఎం వేమయ్య, పి కామేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. జయలక్ష్మి, పెన్మెత్స దుర్గాభవాని, ఎ.విమల తదితరులు పాల్గొన్నారు.

రేపు రాఘవాచారి వర్ధంతి సభ

'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' అనే అంశంపై స్మారకోపన్యాసం

విశాలాంధ్ర-విజయవాడ: విశాలాంధ్ర పూర్వ సంపాదకులు సి. రాఘవాచారి 4వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 29వ తేదీన " ఆశ్రిత పెట్టుబడి దారీ విధానం "అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు సీ రాఘవాచారి ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ కె. జ్యోత్స్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ప్రముఖ జర్నలిస్టు, రచయిత షార్ట్ ఫిలిమ్స్ నిర్మాత పరంజయ గుహ ఠాకుర్త స్మారకోపన్యాసం చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 10గంటలకు విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సభకు విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావ్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. సకాలంలో సభకు హాజరై జయప్రదం చేయాలని జ్యోత్స్న విజ్ఞప్తి చేశారు.

నాకు భద్రత లేదు

(మొదటిపేజీ తరువాయి)

పొంచి ఉంది. నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలో అనేకచోట్ల నాపై అధికార పార్టీ ప్రోద్బలంలో దాడులు జరిగాయి. జగన్ అధికారంలోకి రాగానే నాకున్న భద్రతను తగ్గించారు. హైకోర్టు జోక్యంతో తిరిగి పునరుద్ధరించారు. 2019 ఆగస్టులో అమరావతిలో బస్సు యాత్ర చేపడితే వైసీపీ కార్యకర్తలు రాళ్ల దాడులకు పాల్పడ్డారు. ఈ ఏడాది ప్రాజెక్టుల వద్దకు వెళ్లినప్పుడు కూడా వైసీపీ కార్యకర్తలు దాడులు చేశారు. ఈ పరిణామాలు అన్నింటిని దృష్టిలో ఉంచుకుని రాజమండ్రి జైల్లో నాకు పూర్తిస్థాయి భద్రత కల్పించాలని కోరుతున్నా' అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఎగవేత రోజుకు వంద కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో ఉన్న తాజా సంఖ్యలను ప్రతిబింబిస్తాయని పేర్కొంది. ఇది తక్కువ అంచనా వేయవచ్చని హెచ్చరించింది. 'కనీసం ఒక జాతీయం చేయబడిన బ్యాంకు, ఒక ప్రైవేట్ రంగ బ్యాంకు ఇంకా జూన్ సంఖ్యలు నివేదించనందున మొత్తం పెద్దదిగా ఉండవచ్చు. వరుసగా కనీసం నాలుగు త్రైమాసికాల్లో మొత్తం 3 ట్రిలియన్ల మార్కు కంటే ఎక్కువగానే ఉంది' అని తెలిపింది. ఇదిలాఉండగా, భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) ఇటీవలే ఉద్దేశపూర్వక ఎగవేతదారుల రుణం నిరర్థక ఆస్తి (ఎన్‌పీఏ) ను ఆరు నెలల్లోగా ప్రకటించాలని ప్రతిపాదించింది. అక్టోబరు చివరి నాటికి ఈ ప్రతిపాదనపై ప్రజల అభిప్రాయాలను తెలియజేయాలని కేంద్ర బ్యాంకు కోరింది. ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు అటువంటి రుణాలలో వారి వాటాలో స్వల్ప పెరుగుదలను చూశాయి. అయితే ప్రభుత్వ బ్యాంకులు ఆందోళనకరంగా అతిపెద్ద నష్టాలకు కారణమయ్యాయి. జూన్ 2023లో ఉద్దేశపూర్వక ఎగవేతదారులు చెల్లించాల్సిన డబ్బులో వారి వాటా 77.5 శాతంగా ఉంది. ఉద్దేశపూర్వక ఎగవేతదారులు 10 జాతీయ బ్యాంకులకు మరో రూ. 1.5 లక్షల కోట్లు బకాయి పడ్డారు. ఇందులో భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) జూన్ నాటికి రూ.80 వేల కోట్ల బకాయి ఉంది. ప్రైవేట్ రంగ బ్యాంకుల బకాయి మొత్తం రూ.53,500 కోట్లు.

'సూట్ బూట్ కి సర్కార్'... కుటిలవాద ఆరోపణలు

ఆర్‌టీఐ ప్రత్యుత్తరాలు, పార్లమెంటరీ ప్రశ్నలు, బ్యాంకుల సమాచారం పెద్ద రుణగ్రహీతలు చెల్లించాల్సిన భారీ మొత్తంలో ప్రజాధనాన్ని వెల్లడించినప్పటి నుంచి కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం ఒత్తిడికి లోనైంది. క్రోనీ క్యాపిటలిజం సూచీలో భారతదేశం అధ్వానమైన పని తీరు, 2015లో మోదీ ప్రభుత్వం వివాదాస్పద భూ బిల్లును ఉపసంహరించుకున్న తర్వాత కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ప్రాచుర్యంలోకి తెచ్చిన 'సూట్-బూట్ కి సర్కార్' అనే ప్రతిపక్ష ప్రచారానికి బలం చేకూర్చింది. 'క్రోనీ క్యాపిటలిజం' సూచీలో భారతదేశం 10వ స్థానంలో ఉంది. 2013 నుంచి భారతదేశంలోని 'క్రోనీ-పెట్టుబడిదారీ రంగాల' నుంచి సంపద సూచిక ప్రకారం దాని జీడీపీలో 5 శాతం నుంచి 8 శాతానికి పెరిగింది. ఈ ఏడాది వర్షాకాల సమావేశాల్లో ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరాద్ రాజ్యసభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో, షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు 'గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ.10,57,326 కోట్లను మాఫీ చేశాయని వెల్లడించడం తీవ్ర సంచలనం సృష్టించింది. 10 మంది అగ్రశ్రేణి ఉద్దేశపూర్వక ఎగవేతదారులు షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులకు రూ.40,825 కోట్లు బకాయిపడ్డారని ఆయన చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకారం, భారతదేశంలోని అగ్రశ్రేణి 50 మంది రుణ ఎగవేతదారులు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రూ.87,295 కోట్లు బకాయిపడ్డారు. పరారీలో ఉన్న మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ అతిపెద్ద ఉద్దేశపూర్వక ఎగవేతదారుగా ఉంది. బ్యాంకులకు రూ.8,738 కోట్లు బకాయిపడింది. ఆ తర్వాతి స్థానాల్లో ఎరా ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ లిమిటెడ్ రూ.5,750 కోట్లు, ఆర్‌ఈఐ ఆగ్రో లిమిటెడ్ రూ.5,148 కోట్లు, ఏబీజీ షిప్‌యార్డ్ లిమిటెడ్ రూ.4,774 కోట్లు, కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ రూ.3,911 కోట్లు ఉన్నాయి. ఈ నెల బిజినెస్ టుడే నివేదిక ప్రకారం 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.9.26 లక్షల కోట్లను రికవరీ చేసేందుకు బ్యాంకులు 36,150 ఎన్‌పీఏ ఖాతాలపై దావాలు దాఖలు చేయడంతో ఉద్దేశపూర్వక ఎగవేత కేసులు పెరుగుతున్నాయి. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ విడుదల చేసిన నివేదికలో వాటాల తారుమారుకు పాల్పడినట్లు వెల్లడికావడంతో అదానీ గ్రూప్‌పై వివాదం చెలరేగింది.

దీంతో ఈ ప్రభుత్వంతో ప్రజా ధనానికి గల సంబంధం గతంలో కూడా పరిశీలనకు వచ్చింది. తమ షేర్ల మార్కెట్ విలువలు 60 శాతం పడిపోయినప్పటికీ, అదానీలో కొనుగోలు చేయమని ఎల్‌ఐసీని కోరడంపై విమర్శలు వెల్లువెత్తాయి. నివేదిక ప్రకారం, మహారాష్ట్ర మార్చి 2019 నుంచి ఉద్దేశపూర్వక ఎగవేతలలో అతిపెద్ద పెరుగుదలను చూసింది. మహారాష్ట్ర, దిల్లీ, పశ్చిమ బెంగాల్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలు ఉద్దేశపూర్వక ఎగవేతదారులకు మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వారు చెల్లించాల్సిన మొత్తంలో 70 శాతం పైగా ఉన్నారు. ఈ సమయంలో బకాయి ఉన్న మొత్తం 0.6 ట్రిలియన్ల నుంచి 1.3 ట్రిలియన్లకు పెరిగింది. మార్చి 2019-మార్చి 2023 మధ్య దిల్లీలో 200 శాతం పెరుగుదల 0.6 ట్రిలియన్లకు చేరుకుంది. అందువల్ల, దేశ రాజధానిలో అత్యంత వేగంగా వృద్ధి చెందింది.

ఓటు ఉన్నట్టేనా?

(మొదటిపేజీ తరువాయి)

వేర్వేరు పోలింగ్ కేంద్రాల పరిధిలో చేర్చారు. వీటన్నింటిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అవకతవకలు సరిచేసిన తర్వాతే ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయాలని ప్రతిపక్ష పార్టీలు ఈసీకి విజ్ఞప్తి చేశాయి. ఈనేపథ్యంలో శుక్రవారం ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మన ఓటు ఉంటుందా? ఉండదా? అనే ఉత్కంఠ రాష్ట్రంలోని ఓటర్లలో నెలకొంది. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లలో ఆందోళన నెలకొంది. దీనిపై రాష్ట్రంలో కొంతకాలంగా ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలు చేపడుతుండడం, మరోవైపు 2024 ఎన్నికల్లో వైసీపీ మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రతిపక్ష పార్టీల ఓట్లు తొలగిస్తోందని విస్తృతంగా ప్రచారం జరగడంతో ప్రజల్లో తమ ఓటు హక్కుపై మునుపెన్నడూ లేనంత అభద్రత నెలకొంది. వాస్తవానికి ప్రతిపక్షాల ఫిర్యాదుల ఆధారంగా గుర్తించిన అక్రమాలు, అవకతవకలన్నింటిపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి అనుమానాలన్నింటినీ నివృత్తి చేసిన తర్వాతే ముసాయిదా జాబితా విడుదల చేయాలని, ఇందుకోసం అవసరమైతే ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల గడువు మరికొంత పొడిగించాలని ప్రతిపక్షాలు విజ్ఞప్తి చేశాయి. అయినప్పటికీ ఎన్నికల సంఘం ముందు చెప్పిన విధంగానే శుక్రవారం ముసాయిదా జాబితాను విడుదల చేయడంతో ఓటర్లలో ఆందోళన మరింత తీవ్రంగా ఉంది.

ఏపీలో మొత్తం ఓటర్లు 4,02,21,450

ఆంధ్రప్రదేశ్ ముసాయిదా ఓటర్ల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా విడుదల చేశారు. ఈ మేరకు ఓటర్ల జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచారు. ఈసీ వెల్లడించిన జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం 4,02,21,450 మంది ఓటర్లు ఉండగా.. అందులో మహిళా ఓటర్లు 2,03,85,851, పురుష ఓటర్ల సంఖ్య 1,98,31,791గా ఉంది. సర్వీసు ఓటర్లు 68,158 మంది ఉన్నారు. ముసాయిదా జాబితాలోని అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తామని ఈసీ పేర్కొంది. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా వెల్లడిస్తామని ఈసీ స్పష్టం చేసింది. ముసాయిదా ఓటర్ల జాబితాను అన్ని జిల్లాల్లోని రాజకీయ పార్టీలకు ఇవ్వాల్సిందిగా జిల్లా అధికారులకు ఈసీ సూచించింది. 2022 జనవరి 6 నుంచి 2023 ఆగస్టు 30వరకు అన్ని స్థాయిల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టినట్లు ఈసీ వెల్లడించింది. 21,18,940 ఓట్ల తొలగింపు ప్రక్రియను పునః పరిశీలన చేసినట్టు తెలిపింది. ఆగస్టులో చేపట్టిన ఇంటింటి సర్వేలో జీరో డోర్ నెంబర్లతో 2,51,767 ఓట్లు గుర్తించినట్టు ఈసీ స్పష్టం చేసింది. అలాగే 1,57,939 ఇళ్లలో 10 మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు నమోదైనట్టు గుర్తించామని వెల్లడించింది. దీనికోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి జీరో డోర్ నెంబర్లలో నమోదైన ఓటర్లను 66,740కి కుదించామని స్పష్టం చేసింది. 10 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న ఇళ్లను కూడా తనిఖీ చేసి, దానిని 71,581కి తగ్గించినట్టు తెలిపింది. 2023 సెప్టెంబరు 18 తేదీ నుంచి ఓటర్ల జాబితా ప్రక్రియను ఫ్రీజింగ్‌లో పెట్టడం వల్ల తనిఖీ ప్రక్రియ ముందుకు సాగలేదని పేర్కొంది.

దేశమంతటా అనుసరించేలా

ఏపీ విజన్ ప్లాన్-2047

నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి రాధ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశం మొత్తం ఏపీ స్టేట్ విజన్ ప్లాన్-2047ను అనుసరించేలా అద్భుతమైన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి.రాధ సూచించారు. రాష్ట్రంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న వర్క్‌షాపు అద్భుతంగా జరిగిందని, ప్రాథమిక, ఉత్పాదక, సామాజిక రంగాలకు సంబంధించి అనేక అంశాలపై ఈ వర్క్‌షాపులో ఫలవంతగా చర్చలు జరిగాయన్నారు. వివిధ రంగాల్లో అపరిమితమైన మార్పులను తీసుకు వచ్చేలా ఎంతో తెలివైన, విలువైన ఆలోచనలను అనేక మంది అందజేశారని ఆమె అభినందించారు. ఏపీ స్టేట్ విజన్ ప్లాన్-2047 పై మరింత మేధోమథనం జరిగేలా మరో వారం రోజులపాటు సీనియర్ లీడర్లు, వర్క్‌షాపులో పాల్గొన్న ప్రతి ఒక్కరితోనూ ఇంటెన్సివ్ రౌండ్ చర్చలు నిర్వహిస్తామన్నారు. మూడు రోజుల నుంచి రాష్ట్ర సచివాలయంలో కొనసాగుతున్న నీతి ఆయోగ్ వర్క్‌షాపు శుక్రవారం రాష్ట్ర విద్యా రంగంపై సుదీర్ఘ చర్చ అనంతరం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి వర్క్‌షాపులో ప్రస్తుతం, భవిష్యత్తులో ప్రపంచ వ్యాప్తంగా సంభవిస్తున్న కీలక మార్పులు, సంస్కరణలకు అనుగుణంగా దేశ వ్యాప్తంగా అమలు చేయాల్సిన అనేక సంస్కరణలకు సంబంధించి ఎంతో మంది విద్యా వేత్తలు, మేధావులు సూచనలు, సలహాలు అందజేశారన్నారు. వాటన్నింటినీ అమలు పర్చాలంటే కేంద్ర స్థాయిలో ఉన్న విద్యా సంస్థల్లో వ్యవస్థాగతంగా ఎన్నో కీలక మార్పులు, చేర్పులు చేయాల్సిన అవసరముందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు. వీటన్నింటినీ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి అమలుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు మూడో రోజు వర్క్‌షాపులో భాగంగా రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ పవర్ పాయింటే ప్రజెంటేషన్ ద్వారా జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్ర పాఠశాల విద్యా విభాగంలో అమలు పరుస్తున్న విద్యా సంస్కరణలను, విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఆయన వివరించారు. ఏపీ స్టేట్ విజన్ ప్లాన్-2047 లో భాగంగా పాఠశాల విద్యా విభాగం లక్ష్యాలు, వాటి సాధనకు అమలు చేయనున్న వ్యూహాత్మక ప్రణాళికలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమ చంద్రారెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పాఠశాల విద్యా శాఖ కమిషనర్, స్కిల్ దవలప్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేశ్ కుమార్ వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ వర్క్ షాపునకు నీతి అయోగ్ డీఎంఈఓ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్, రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, ఏపీ ఎస్ఎస్డీసీ ఎండీ వినోద్ కుమార్, సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి, ఎస్ సీ ఈ ఆర్ టీ డైరెక్టర్ బి.ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళికా శాఖ డైరెక్టర్ ఎం.సుదర్శనం, నీతి ఆయోగ్ సలహాదారులు సీహెచ్. పార్థసారధి రెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు అమ్రిత్ పాల్ కౌర్, సీనియర్ కన్సెల్టెంట్ శైలీ మణికర్, పర్యవేక్షణ, మూల్యాంకన నిపుణులు బిప్లవ్ నంది, బోస్టన్ కన్సల్టెంట్ గ్రూపు ప్రతినిధి అభిషేక్ తదితరులు హాజరయ్యారు.

కులోన్మాదంతో నాపై దాడికి యత్నం

మంత్రి అంబటి రాంబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఒక నిశ్చితార్థానికి హాజరయ్యేందుకు తాను తెలంగాణలోని ఖమ్మం పట్టణానికి వెళ్లగా కులోన్మాదంతో నాపై దాడికి యత్నించారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు వాపోయారు. నాడు వంగవీటి రంగాను చంపినట్టు తననూ హత్య చేస్తారా?, ఏమిటీ ఈ ఉన్మాదం? అని ప్రశ్నించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మంత్రి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. గతంలోనూ తనను ఎలిమినేట్ చేస్తే, రూ.50 లక్షల చందా ప్రకటించారంటూ... దాడులు చేస్తే చేతులు కట్టుకుని చూస్తూ ఊరుకోబోమని మంత్రి హెచ్చరించారు. కులం మీకే కాదని... మాకూ కులం ఉందని స్పష్టం చేశారు. చంద్రబాబు అవినీతి చేసి జైలుకు వెళ్తే తామెలా బాధ్యలమవు తామని ప్రశ్నించారు. బాబుకు ప్రాణహానా? అనారోగ్యమా? ఏది నిజం? అని ప్రశ్నించారు. అవన్నీ బెయిల్ కోసం పాకు లాడే పన్నాగాలేనని ఎద్దేవా చేశారు. మంత్రిగా తానొక ప్రైవేటు కార్యక్రమానికి వెళ్తే నామీద దాడికి ప్రయత్నిస్తే... అది నిరసన సెగ ఎలా అవుతుందనాన్నారు. దాడికి యత్నించిన వాళ్ల చేతుల్లో కర్రలు ఉన్నాయని, వాళ్లు నన్ను బూతులు తిడుతూ ఏ రకంగా ప్రవర్తించారో టీవీ ఛానెళ్లలో అందరూ చూశారన్నారు. అసలు, నేనేమీ రాజకీయ ప్రసంగాల కోసం అక్కడకు వెళ్లలేదే? మరి ఎందుకు వారు నామీద దాడికి ప్రయత్నించారుని మండిపడ్డారు. చంద్రబాబుకు జైల్లో ప్రాణహాని ఉందని ఒక పక్కన అంటూనే, ఆయనకు ఆరోగ్యం బాగుండటం లేదని మరోపక్క చెప్పటాన్ని తప్పు పట్టారు. ఈ రెండింటిలో ఏది నిజమని మంత్రి సూటిగా ప్రశ్నించారు.

17న నంద్యాల ర్యాలీకి భారీగా తరలిరండి

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవానీ పిలుపు

విశాలాంధ్ర ఉండి: నవంబరు 17-19 తేదీల్లో నంద్యాలలో జరుగనున్న ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర 15 వ మహాసభలు విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని పిలుపు నిచ్చారు. ఉండి ఏఎంసీ ఆవరణలో జరుగుతున్న మహిళా సమాఖ్య పశ్చిమ గోదావరి జిల్లా 15వ మహాసభల రెండవ రోజు శుక్రవారం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మహాసభల సందర్భంగా నవంబరు 17 న నంద్యాలలో జరిగే మహిళల మహా ప్రదర్శన, బహిరంగ సభలో జిల్లా నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. మహిళలపై జరుగుతున్న దాడులు నివారించడంలో ప్రభు త్వాల వైఫల్యాలను ఎండగడుతూ మహిళా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా స్వేచ్ఛ, సమా నత్వం సాధన దిశగా, మహిళా హక్కుల పరిరక్షణ, మహిళా చట్టాల సక్రమ అమలుకు, చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తక్షణ అమలు కోరుతూ మహాసభల్లో పోరాట కార్యాచరణ రూపొందిస్తా మన్నారు. మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పంచదార్ల దుర్గాంబ మాట్లాడుతూ మహిళల సమున్నత అభివృద్ధి, లింగ వివక్షతకు వ్యతిరేకంగా, మహిళా సాధికా రత సాధనకు ఉధృత పోరాటాలకు పూనుకో వలసి అవసరం వుందన్నారు. మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి మాట్లాడుతూ పెరిగిన ధరలతో ప్రజల జీవనం దుర్భరంగా మారిందని, అధిక ధరలను అరికట్ట డంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. జిల్లాలో మహిళా సమాఖ్య బలోపేతానికి కృషి చేసి మహిళలు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తా మన్నారు. జిల్లా మహిళా సమాఖ్య నిర్వహించిన కార్యకలాపాల నివేదికను మహాసభలో ప్రవేశ పెట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు తదితరులు మాట్లాడారు.

వలస కూలీల మృతిపై సీపీఎం దిగ్భ్రాంతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: శ్రీసత్యసాయి జిల్లాలో గోరంట్ల మండలం కలిగిరి, వానవోలు గ్రామాలకు చెందిన 13 మంది వలస కూలీలు రోడ్డు ప్రమాదానికి గురై చనిపోవడం పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు శు క్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... కూలీల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం, భూమిలేని పేదలకు రెండెకరాల భూమి ఇవ్వాలన్నారు. ఈ సంవత్సరం తీవ్ర కరువు కారణంగా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక... ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించకపోవడం వల్ల బతుకుతెరువుకోసం అనివార్యంగా వారంతా బెంగళూరుకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఏటా రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షలాది మంది వలసలు పోతుంటారని వివరించారు. గ్రామాల్లో ప్రభుత్వం ఉపాధి హామీ పనులు కల్పించినట్లయితే ఇలాంటి సంఘటనలు జరిగేవి కాదన్నారు. ఇప్పటికైనా అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

కరువు, రైతు సమస్యలపై నవంబరులో క్షేత్రస్థాయి పర్యటనలు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కరువు, రైతు సమస్యలపై నవంబరులో క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్ట నున్నట్లు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్రంలో వంద సంవత్స రాల్లో ఇంతటి కరువు చూడలేదని, సాగునీరు అందక రైతుల కళ్లముందే పంటలు ఎండిపోతున్నప్పటికీ, జగన్ ప్రభుత్వం పట్టనట్టు ఉందన్నారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు, దుర్భిక్ష పరిస్థితులపై అచ్చెన్నాయుడు, తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్వర్యంలో వ్యవసాయ స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కళ్లముందే ఎండిపోతున్న పంటలను కాపాడటంలో జగన్ ప్రభుత్వ వైఫల్యంపై నేతలు విస్తృతంగా చర్చించారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సాగునీరు అందక కళ్లముందే పంటలు ఎండిపోతున్నప్పటికీ, రైతులపై కనీస కనికరం లేదన్నారు. కర్నాటక రోడ్డు ప్రమాదంలో 3 మంది మరణించడానికి జగన్ విధానాలే కారణమని, కరువు నివారణకు చర్యలు చేపట్టకపోవడం వల్లే బతుకుదెరువు కోసం అనంతపురం వాసులు కర్నాటకకు వెళ్లి ప్రమాదంలో మృత్యువాత పడ్డారని వివరించారు. ఉపాధి లభించి ఉంటే 13 మంది మరణించే వారు కాదని, కరువు భయపెడుతున్నా నివారణ చర్యలపై జగన్ ప్రభుత్వ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. రాయలసీమలో 18 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సిన వేరుశెనగ పంట ఈ ఏడాది కేవలం 7 లక్షల ఎకరాల్లోనే సాగైందన్నారు. అది కూడా ఆ పంటకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని తెలిపారు. ఉద్యాన పంటలకు సాగు నీరు అందడం లేదని, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు కరువు నెలకొని ఉందని, పట్టిసీమను సక్రమంగా వినియోగించు కోకపోవడం వల్ల 40 టీఎంసీల నీరు కోల్పోయామని చెప్పారు. సీఎం జగన్‌కు, సాగునీటి శాఖ మంత్రికి, వ్యవసాయ మంత్రికి కనీస బాధ్యత లేదని అన్నారు. రైతులకు ఆరుతడి పంటలకు నీళ్లివ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. అనేక ప్రాంతాల్లో ఉన్న నీటిని కూడా వృధా చేస్తున్నారని, గోదావరి జిల్లాల్లోనూ సాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. కర్నాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 13 మంది అనంత వాసులు చనిపోవడనికి జగన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కాలవ శ్రీనివాసులు, ప్రత్తిపాటి పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, కూన రవికుమార్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, మిర్చియార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి సాంబిరెడ్డి పాల్గొన్నారు.

ఈఏపీసెట్ మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలి

సీఎంకు ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సుప్రీంకోర్టు ఆదేశాలను, ఏఐసీటీఈ ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ఈఏపీసెట్-2023 మూడో విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శిఖరం నరహరి, ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్ కు శుక్రవారం ఆయన లేఖ రాశారు. విద్యార్థులు నష్ట పోకుండా, విద్య కోసం పక్క రాష్ట్రాలకు తరలి పోకుండా ఏపీ ఈఏపీసెట్ కౌన్సెలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 2023-24 సంవత్సరానికి సంబంధించిన కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీ సెట్-2023)లో అర్హత సాధించిన విద్యార్థులకుగాను మొదటి, రెండో రౌండ్‌ల కౌన్సెలింగ్‌లో 69 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయని వివరించారు. ఇంకా 27,590 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఏఐసీటీఈ ఆమోదించిన అన్ని విద్యా సంస్థల్లో ప్రవేశాలను ఈనెల 30వ తేదీ వరకు పొడిగిం చారన్నారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రత్యేక (మూడవ విడత) కౌన్సెలింగ్‌ను తక్షణమే నిర్వహించాలని కోరారు. ఈ కౌన్సెలింగ్ నిర్వహణ ఆలస్యం కారణంగానే వేలాది మంది విద్యార్థులు తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు ఇంజనీరింగ్ విద్య కోసం వలస పోయారన్నారు. విద్యా సంవత్సర క్యాలెండర్ ను హడావుడిగా నిర్వ హించడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. ఇది పూర్తిగా ఉన్నత విద్యాశాఖ అధికారుల వైఫల్యమని ఆ లేఖలో పేర్కొన్నారు.

ప్రతిపక్షాలతో అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

విశాలాంధ్ర-నరసాపురం: వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక లేక ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మొగల్తూరు సెంటర్‌లో వైసీపీ బస్సు యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. ఈ యాత్ర మొగల్తూరు నుంచి రామన్నపాలెం, ఎల్‌బీ చర్ల మీదుగా నరసాపురం చేరుకుంది. సాయంత్రం ఆరు గంటలకు నరసాపురంలోని ప్రకాశం రోడ్డు రామాలయం సెంటర్‌లో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నర సంవత్సరాల పాలన, సాధికారత ప్రజలకు వివరించడానికి బస్సు యాత్రకు శ్రీకారం చుట్టామని తెలిపారు. నరసాపురం నియోజకవర్గంలో రూ.1,650 కోట్లను సంక్షేమ పథకాల రూపంలో అందజేశామన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. మంత్రి శ్రీదిరి అప్పలరాజు మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతీ సామాజిక వర్గానికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చి అండగా నిలిచారని తెలిపారు. ప్రతి సామాజిక వర్గానికి ఒక ప్రతినిధి ఉండాలని వివిధ కార్పొరేషన్లలోను, ప్రభుత్వ పదవుల్లోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సమపాళ్లలో ప్రాతినిధ్యం కల్పించారన్నారు. దళితులు తలెత్తుకుని జీవించేలా గిరిజనులు గర్వపడేలా చేసిన నాయకుడు జగన్ అని అన్నారు. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ సమాజంలోని అట్టడుగు వర్గాల జీవితాల్లో మార్పు కోసం ముఖ్యమంత్రి జగన్ కృషి చేశారని తెలిపారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా పదవులు ఇచ్చి వారి సాధికారతకు కృషి చేశారన్నారు. మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ మాట్లాడుతూ గతంలో అనేక పార్టీలు బీసీ సామాజిక వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూసేవని, ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా వర్గాలకు రాజ్యాధికారం కట్టబెట్టారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మంత్రి పదవులు ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి సంక్షేమాన్ని చేరువ చేశారన్నారు. ఈ బస్సు యాత్రలో అనేక మంది శాసన సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ సర్కారు విదేశీ విధానం తప్పులతడక

కేంద్ర మాజీమంత్రి చింతామోహన్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కేంద్రంలోని మోదీ సర్కారు అవలంబిస్తున్న విదేశాంగ విధానం తప్పుల తడక సాగుతోందని మాజీ కేంద్రమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ దుయ్యబట్టారు. ఇజ్రాయిల్ సేనలు ఆస్పత్రిపై బాంబు దాడులు చేయడంతో ఎంతోమంది మహిళలు, పసిపిల్లలు సహా అమాయక ప్రజలు చనిపోయారని... భారత ప్రధాని మోదీ కనీసం మానవతా దృక్పథం లేకుండా కేవలం రాజకీయ కోణంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్ చెప్పినట్లుగా సమర్ధిస్తారా అని చింతా మోహన్ ప్రశ్నించారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశం లో జీఎస్టీ విధానం అస్త వ్యస్తంగా ఉందన్నారు. అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు కమిటీలో ఉన్నా దీనిపై వారికి అవగాహన ఉండటంలేదన్నారు. దేశంలో 3వేల రకాల వస్తువులపై జీఎస్టీ వసూలు చేస్తూ నెలకు రూ.1.25 లక్షల కోట్లు వసూలు చేస్తున్నారని... ఈ డబ్బంతా కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఐదు స్లాబ్ లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లలో ఎంతో అవినీతి జరుగుతోందని... దీని వెనుక బీజేపీ పెద్దల హస్తం ఉందన్నారు. అఖరికి తలనొప్పి, షుగర్ వంటి మందుల నుంచి మరమ్మతులపై కూడా జీఎస్టీ వసూలు చేస్తుండ టంతో పేద, మధ్యతరగతి ప్రజలు, సాధారణ వ్యాపారాలు చేసుకునే వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రపంచంలో ఎక్కడా ఈ తరహా పన్ను లేదని... జీఎస్టీ అవినీతిమయం గా మారిందన్నారు. రాష్ట్రంలో వైసీపీప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామ్యమే లేదని చింతా మోహన్ విమర్శించారు. మైక్ పర్మిషన్‌కు కూడా కాలుష్య ధృవీకరణ పత్రం అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో విద్యా విధానం మార్పు చేయడం వల్ల ఎస్సీ లు, ఎస్టీ , బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికి అవసరమైన స్కాలర్‌షిప్‌లు సైతం అదంటంలేదన్నారు. విద్యా విధానం మార్పు చేయడానికి ముఖ్యమంత్రి జగన్ ఏమైనా శాశ్వ తంగా ఉంటారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందని... మద్యం తాగుతున్న వారి లివర్‌లు చెడిపోయి అనారోగ్యం పాలవుతు న్నారన్నారు. చట్టసభల్లో ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్‌లు అమలు చేయాలని చింతా మోహన్ డిమాండ్ చేశారు.

చంద్రబాబు కేసులో సీజేఐ జోక్యం చేసుకోవాలి

జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు చేస్తోందన్నారు. మార్గదర్శి పై కక్ష సాధింపు ఎందుకని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టును చింతా మోహన్ తీవ్రంగా ఖండించారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన వ్యక్తిని, ప్రతిపక్షనేత ను అర్ధరాత్రి అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు. చంద్ర బాబు అరెస్టు వెనక బీజేపీ హస్తం ఉందన్న సంగతి అందరికీ తెలుసునన్నారు. కోర్టులలో కుడా రాజకీయ ప్రమేయం ఉందన్న అనుమానం ప్రజల్లో నెలకొందన్నారు. ఈ విషయంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అర్ధరాత్రి తీర్పులు ఏమిటని ప్రశ్నించారు. 17-ఏ పై నిర్ణయం తీసుకోడానికి కోర్టులకు నెల రోజుల సమయం కావాలా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. నెల రోజులకు పైగా చంద్రబాబును జైల్లో పెట్టి ఏం సాధించారంటే... మరలా టీడీపీ అధికారంలోకి రావటానికి జగన్ ఆ పని చేసినట్లు అయ్యిందన్నారు. చంద్రబాబుపై ప్రస్తుతం ప్రజల్లో విపరీతమైన సానుభూతి కనపడుతోందని.. దీనికి వైసీపీనే కారణమని చింతామోహన్ అన్నారు. తమిళనాడు తరహా పరిస్థితులు ఏపీలో కనిపిస్తున్నాయని చెప్పారు.

చంద్రబాబు ఆరోగ్యం, భద్రతపై కుట్ర

లేఖ రాసినా స్పందించలేదు: యనమల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోగ్యం, భద్రత విషయంలో కుట్ర జరుగుతోందని శాసనమండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 25న తన భద్రతపై చంద్రబాబు లేఖ రాస్తే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. చంద్రబాబు ఆరోగ్యాన్ని దెబ్బ తీసేందుకు ప్రభుత్వం ఏకంగా ఓ కమిటీనే వేసిందనే సమాచారం తమకుందన్నారు. చంద్రబాబు పేరుకే జుడిషియల్ కస్టడీలో ఉన్నారని... కానీ వాస్తవానికి ఆయన ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నారన్నారు. క్రిమినల్ మైండ్ ఉన్న నేతలు వైసీపీ నేతలు అంటూ విరుచుపడ్డారు. సొంత బాబాయిని చంపిన వారికి మిగిలిన వారిని చంపడం ఓ లెక్కా ? అని విమర్శించారు. చంద్రబాబు హెల్త్ రిపోర్టును ఎందుకు బయట పెట్టడం లేదని నిలదీశారు. హెల్త్ రిపోర్టును డాక్టర్లే వెల్లడి చేయాల్సి ఉన్నా... చంద్రబాబు విషయంలో జైలు అధికారులే హెల్త్ రిపోర్టులు ఇస్తున్నారన్నారు. చంద్రబాబుకు బ్లడ్ టెస్ట్ చేశారా? చేస్తే ఆ రిపోర్టులు ఎక్కడ? హెల్త్ రిపోర్టులో ఏం రాయాలో సజ్జల చెబుతారా? అంటూ యనమల ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు ఆరోగ్యపరంగా ఉన్న ఇబ్బంది విషయం కాకుండా వేరే అంశాలను ప్రస్తావిస్తూ హెల్త్ రిపోర్టు ఇస్తున్నారన్నారు. ఆయన ఆరోగ్యాన్ని క్షీణింప చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని, జైలులోనే చంద్రబాబును అంతమొందించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ నెల 25వ తేదీన చంద్రబాబు లేఖ రాస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఏసీబీ జడ్జి ఆ లేఖను వెంటనే పరిగణనలోకి తీసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రజల్లో చంద్రబాబుకు విపరీతంగా ఆదరణ పెరుగుతోంది కాబట్టే కుట్ర పూరితంగా జైలుకు పంపారని విరుచుకుపడ్డారు. స్కిల్ కేసే తప్పుడు కేసు అన్నారు. వేల కోట్ల అవినీతి జరిగిందని మొదట చెప్పి, ఇప్పుడు రూ. 27 కోట్లకు వచ్చారన్నారు. ప్రభుత్వ కుట్రపూరిత చర్యలన్నీ ప్రజలు గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఇప్పటికైనా చంద్రబాబుకు సరైన భద్రత కల్పించడంతో పాటు, మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని యనమల కోరారు.

ఎట్టకేలకు మణప్పరం దొంగల అరెస్టు

విశాలాంధ్ర-మచిలీపట్నం: కంకిపాడు మణప్పురం బ్రాంచ్‌లో బంగారం చోరీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఎస్పీ పీ జాషువా శుక్రవారం స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించి కేసు వివరాలను వెల్లడించారు. ఈనెల 16వ తేదీన కంకిపాడు మణప్పురం గోల్డ్ లోన్ బ్రాంచ్‌లో బ్రాంచ్ హెడ్ గా పనిచేస్తున్న రెడ్డి వెంకట పావని... అందులో పనిచేసే సిబ్బంది సహకారంతో బ్రాంచ్ నందు ఖాతాదారులు తనఖా పెట్టిన బంగారు ఆభరణాల (సుమారు 951 మంది ఖాతాదారులు తనఖా పెట్టిన రూ.3.87 కోట్ల విలువ గల గోల్డ్ ప్యాకెట్స్) ను తస్కరించినట్లు మణప్పురం గోల్డ్ లోన్ యజమాన్యం వారు ఫిర్యాదు చేశారు. దీంతో కంకిపాడు పోలీసు స్టేషన్ సిబ్బంది, సీసీఎస్ సిబ్బంది టీములుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం ఉదయం 05:00 గంటల సమయంలో నెప్పలి గ్రామం లో జాతీయ రహదారి పక్కన ఉన్న డొంకరోడ్డు వద్ద నిందితులు రెడ్డి వెంకటపావని, రేవు దుర్గా ప్రసాద్, కొక్కిలిగడ్డ నాగబాబు, మిట్టగడుకుల ప్రశాంతిలను గుర్తించి అదుపులోకి తీసుకోవడం జరిగిందని... నేరం చేసినట్లు అంగీకార స్టేట్‌మెంట్ తీసుకున్న తర్వాత ఉదయం 10:45 గంటలకు వారిని అరెస్టు చేసి... ఈ కేసులో చోరీ కాబడిన బంగారు వస్తువులను రికవరీ చేశామని వివరించారు. వారి వద్ద నుంచి ఖాతాదారులు తనఖా పెట్టిన సుమారు 7774.58 గ్రాముల బరువు కలిగిన 856 గోల్డ్ ప్యాకెట్స్, రూ.10,200 నగదు, నలుగురు నిందితుల నుంచి వారు వాడిన 8 సెల్‌ఫోన్ లు, ఒక కారును రికవరీ చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ముద్దాయిలను కోర్టుకి హాజరు పరుస్తామని ఆయన చెప్పారు. ఈ కేసులో ముద్దాయిలను అరెస్టు చేసి, చోరీ సొత్తు ను రికవరీ చేసినందుకు గన్నవరం ఎస్‌డీపీఓఆర్ జయసూర్య, సీసీఎస్ డీఎస్పి మురళీకృష్ణ ని, కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీ శ్రీనివాసర రావు, ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి ఖండన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నెల్లూరు జిల్లా కావలి పట్టణ శివారులోని మద్దూరుపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాముల వద్ద ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ, మూకుమ్మడిగా గాయపరిచిన ఘటనను ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. విధుల నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి పాల్పడినవారు ఎంతటి వారైనప్పటికీ, చర్యలు తీసుకోవా లన్నారు. లేకుంటే ఈ విషయంలో ఎంప్లాయిస్ యూనియన్ ఆందోళనకు సిద్ధమవుతుందని హెచ్చరించారు.

రైతుల్ని చంద్రబాబు మోసం చేశారు: బొత్స

విశాలాంధ్ర-విజయనగరం: గతంలో చంద్రబాబు ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాడని మంత్రి బొత్స సత్య నారాయణ ఆరోపించారు. జిల్లాలో శుక్రవారం సామాజిక సాధికారయాత్ర ప్రారంభ సందర్భంగా మంత్రులు బొత్స, మేరుగు నాగార్జున మీడియాతో మాట్లాడారు. ముందుగా మంత్రి బొత్స మాట్లా డుతూ చంద్రబాబునాయుడు రైతులను నిలువునా మోసం చేశారన్నారు. తన హయాంలో డ్వాక్రా మహిళలను దగా చేశాడని, బెల్టు షాపులను రద్దు చేస్తామని చెప్పి ప్రతి గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడిపారన్నారు. చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళతామన్నారు. భువనేశ్వరి స్వేచ్ఛగా యాత్ర చేస్తున్నారని... అంతకన్నా ఇంకా ఏమి స్వేచ్ఛ కావాలని ప్రశ్నించారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ గతంలో చంద్రబాబు హయాంలో సామాజిక అసమానతలు పాటిస్తూ, ఎస్సీ, బీసీ మైనారిటీలను అన్యాయానికి గురిచేస్తే... సామాజిక విప్లవానికి జగన్ తెరతీశారన్నారు. ఎస్సీ కుటుంబంలో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అంటూ చంద్రబాబు గతంలో ఎస్సీ సామాజికవర్గాన్ని కించ పరిచేవిధంగా మాట్లాడటం ఎవరైనా మర్చిపోతారా అని ప్రశ్నించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్
(REGD. NO.AMC/KNA/DCO/2016/122)
డోర్ నెం: 54-16-3/3, ప్లాట్ నం: 48, రోడ్డు నెం. 3, లయోలా గార్డెన్స్, విజయవాడ-520008.
ఫోన్: 0866-2452129, e-mail:housing.emp@gmail.com, www.aphousingsociety.com

Notice. No.AGM/3/2023-2024 Date: 25.10.2023

వార్షిక సర్వ సభ్య సమావేశపు నోటీసు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ (రిజిస్టర్ నం.AMC/KNA/DCO/2016/122), విజయవాడ వారి 2022-2023 ఆర్థిక సంవత్సరపు వార్షిక సర్వ సభ్య సమావేశము **ది.19.11.2023వ తేదీ ఆదివారం రోజున ఉదయం.09.30 గం.ల నుండి మధ్యాహ్నం 02.30 గం.ల వరకు** సిద్ధార్థ అకాడమీ వారి సమావేశపు హాల్, మొఘల్రాజపురం, విజయవాడ నందు నిర్వహించుటకు నిర్ణయించబడింది. సదరు మీటింగు నోటీసు, అజెండా, వార్షిక రిపోర్టులను రిజిస్టర్ పోస్టు ద్వారా సభ్యులందరకూ సొసైటిలో రికార్డు కాబడిన వారి చిరునామాలకు బట్వాడా చేయబడినవి. అదనంగా, సభ్యుల వ్యక్తిగత ఈ-మెయిల్, వాట్సప్ ల ద్వారా మరియు సొసైటి యొక్క నోటీసు బోర్డులపై కూడా సమాచారం తెలియజేయుటకు చర్యలు తీసుకొనబడినవి. కావున సొసైటి సభ్యులు అందరూ తప్పని సరిగా సమావేశం లో పాల్గొని దిగ్విజయం చేయవలసినదిగా కోరడమైనది.
Note : శ్రీయుత జిల్లా సహకారఅధికారి, NTR జిల్లా వారి లేఖ No.1165/2023/D, తేదీ: 26.09.2023 ను అనుసరించి మరియు గత మీటింగులకు కోరం లేనందున మూడవ సారి నిర్వహించబడుతున్నందున,మూడు వారాల గడువుతో నిర్వహించవచ్చనే సొసైటి బైలా నం.13 (iv) ద్వారా సంక్రమించిన అధికారాలతో ఈ నోటీసు జారీ చేయబడినది.

సం/- అద్దాల సుబ్బరాజు
అధ్యక్షులు

సంపాదకీయం

అధమస్థాయిలో ఆరోగ్యరంగం

ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యరంగం ధనిక దేశాలలో మినహా పేద, అభివృద్ధి చెందుతున్న దేశాలలో అధ్వాన్నంగా ఉంది. కొవిడ్–10 లాంటి మహమ్మారి సంభవించినప్పుడు వైద్య చికిత్స వసతులు ఎంత దారుణంగా ఉన్నాయో మన దేశంలో స్వయంగా అనుభవించాము. మొదటిసారిగా కరోనా మహమ్మారి మాత్రమే ప్రపంచ ప్రజలంతా చవిచూశారు. దాదాపు రెండుకోట్లమంది ప్రాణాలు వదలినట్లు వెల్లడైన అంచనాలే మన ఆరోగ్యపరిస్థితి ఎలా ఉందో స్పష్టం చేసింది. అనారోగ్యానికి వాయు కాలుష్యం, ప్రకృతి విధ్వంసం, ఆహారం, స్వచ్ఛమైన నీరు లభ్యంగాకపోవడం ప్రధాన కారణాలు. అలాగే ప్రభుత్వాలు తగిన ప్రణాళికలు, విధానాలు రూపొందించి అమలు చేయకపోవడం కీలక అంశాలు. ప్రకృతి ధ్వంసంగాకుండా కాపాడుకోవాలన్న ఆలోచన పాలకులకు లేకపోవడం, ఒకవేళ కొందరికి ఉన్నా తగిన చర్యలు అమలు జరగకపోతే ప్రకృతి నాశనం కొనసాగి సర్వరంగాలు కలుషితమవుతాయి. ఇందులో ధనిక, పేద దేశాల మధ్యవ్యత్యాసాలు ఎక్కువ. పారిశ్రామికరంగం గత 200సంవత్సరాల కాలంలో అపారంగా పెరిగి కాలుష్యం సర్వవ్యాప్తమైంది. ఇది ప్రజల ఆరోగ్యాలను హరించివేస్తోంది. ప్రభుత్వాలు ఆరోగ్యరంగానికి బడ్జెట్ కేటాయింపులు అధమంగా ఉంటున్నాయి. ఇటీవలకాలంలో ప్రజలకు చికిత్సలు, రోగగ్రస్థులకు అవసరమైన ఆస్పత్రులు, వైద్యులు, సేవలకు నర్సులు తగినంతమంది ఉండటంలేదు. ప్రభుత్వం ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడంలోనూ పూర్తిగా విఫలమవుతోంది. ప్రభుత్వ చికిత్ససేవలు తగినన్ని లేక, అత్యంత ఖరీదైన ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి అప్పులపాలవడం సర్వసాధారణమవుతుంది. ఆరోగ్యరంగం మెరుగుపరిచేందుకు వందలకోట్లు ఖర్చుచేసి అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్నాయి. అత్యధిక దేశాల ఆరోగ్యమంత్రులు ఉన్నతాధికారులు పాల్గొని సుదీర్ఘచర్చలు జరిపి అమలు జరిపేందుకు తీర్మానాలు చేస్తాయి. అయితే ప్రతి సంవత్సరం సదస్సులు జరిపి కొత్తతీర్మానాలు ఆమోదించినప్పటికీ అమలులోనే అలసత్వం, తగినన్ని నిధులు సమకూర్చకపోవడం ఉంది. ఆరోగ్య రంగానికి, ప్రకృతి విధ్వంసానికి అవినావభావసంబంధం ఉంది. సర్వరంగాలు కలుషితం కావడంవల్ల వివిధ మార్గాలద్వారా ప్రజల ఆరోగ్యాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.

గాలి, ఆహారం, నీరు కలుషితం అవుతున్నాయి. ఇవి ప్రధానంగా ప్లాస్టిక్, కృత్రిమ ఎరువులు, రసాయనాలు మూలంగా పంటలుపండే భూములు, ధాన్యం, వీటిని సేవిస్తున్న ప్రజలు వివిధ రోగాలబారిన పడుతున్నారు. చికిత్సలు అందుకుంటున్నవారిలో తరతమ భేదాలున్నాయి. ప్లాస్టిక్ రేణువులు మనిషి ఊపిరితిత్తులలోకిచేరి అనేక రోగాలకు లోనవుతున్నారని తాజా పరిశోధనలు వెల్లడించాయి. చివరకు పైన ఏర్పడే వర్షపు మేఘంలో ప్లాస్టిక్ అతి సూక్ష్మమైన ప్లాస్టిక్ రేణువులుచేరి వర్షపునీరు రూపంలో భూమిపైకి చేరుతున్నాయి. సాధారణంగా వర్షపునీరు స్వచ్ఛంగా ఉంటుందని భావిస్తాము. ఇప్పుడు మనం పీల్చే గాలిలో 96శాతం మంది కలుషిత గాలిని పీలుస్తున్నామని ఐక్యరాజ్యసమితి, ఆరోగ్య సంస్థ పరిధిలో పనిచేసే శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఆరోగ్యరంగం మెరుగుపడేందుకు పాలకులు, ప్రజలు రెండు విభాగాలపై శ్రద్ధ వహించి కలుషితంచేసే వీలైనన్ని వస్తు ఉత్పత్తులను నిషేధించాలి. ఇలాంటి అనేక అంశాలను చర్చించి నిర్ణయాలు తీసుకుని అమలు చేయడానికి ప్రపంచస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సు బెర్లిన్‌లో అక్టోబరు 15–17 తేదీలలో జరిగింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ డైరెక్టరు జనరల్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రపంచ మెడికల్ సంస్థ, ప్రపంచ బ్యాంకు, తదితర అనేక సంస్థలు ఆరోగ్యానికి సంబంధించిన సంస్థల వ్యవస్థాపకులు, నిపుణులు పాల్గొన్నారు. 2009 నుంచి ప్రతి ఏటా ఇలాంటి సదస్సులు జరుగుతూనే ఉన్నాయి. ఇవిగాక, ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా 15–16 రోజులపాటు కాలుష్యం నిర్మూలనపై సదస్సు జరిగి నిర్ణయాలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య కార్యాచరణ అంశాన్ని తీసుకొని చర్చించి తీర్మానాలు చేశారు. కాలుష్యం తిరిగి బాగుచేయలేనంతగా పెరిగిందని, నిర్ధారించిన శాస్త్రవేత్తలు ఇప్పటికైనా పాలకులు, ప్రజలు అప్రమత్తం కావాలని హెచ్చరిం చారు. ఒకరోజు ప్రధానమంత్రి నుంచి దేశమంతటా మంత్రులు, చట్టసభల సభ్యులు చీపురు పట్టుకొని రోడ్లపైన చెత్తను ఒకచోటికి ఊడ్చినందువల్ల 'స్వచ్ఛ భారత్' సాధ్యంకాదు. ఒకవైపు కాలుష్యం పెరగడానికి చర్యలు తీసుకుంటూ మరోవైపు 'స్వచ్ఛ భారత్' దినోత్సవాలు జరిపి కోట్లు ఖర్చుచేస్తే ప్రజలకు భారం అవుతుందేగానీ ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఊడ్చిన వాళ్ల ఫొటోలను పత్రికల్లో ప్రచురించి పాలకుల కనుసన్నల్లో ఉంటూ స్వీయ ప్రయోజనాలు పొందుతారు. ప్రజలను మాయచేసేందుకు పాలకులు ఎల్లవేళలా ప్రయత్నిస్తూనే ఉంటారు. బెర్లిన్ సదస్సు మానవకేంద్రంగా వైద్యచికిత్స అందించడం, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల భాగస్వామ్యంతో ఆరోగ్యచికిత్సకు ఆర్థిక వనరులను సమకూర్చే విధానల రూపకల్పనపై చర్చించి తీర్మానించారు. ఇప్పటికే ప్రభుత్వరంగాన్ని నీరుగార్చి, ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు ఇలాంటి తీర్మానాలుచేసి ప్రజలను మభ్యపెడుతున్నారు. వైద్య చికిత్స అందించడంలో సమత్వం పాటించడం, డిజిటల్ ఆరోగ్యభద్రత కార్యక్రమాలు అమలుపై తీర్మానంచేసినా పెద్ద ఫలితం ఉండదు. డిజిటల్ పరిజ్ఞానం ఎంతమందికి ఉంది. దీన్ని ఉపయోగించుకుంటున్న వారు చాలా తక్కువమంది. ముందుగా కాలుష్యం తగ్గాలి. అందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వాలు తీసుకోవాలి. అదే సమయంలో ప్రజలు అప్రమత్తమై పాలకులు ప్రకటించే కార్యక్రమాలను అమలుచేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. నేడు అత్యంత కీలక సమస్య కాలుష్యం నిర్మూలనే.

శివాజీకి చీర్స్... ఖదీర్ మామకు హగ్స్..

కాంక్రీట్ గోడల్లో తమని తాను కాపాడుకున్న వృద్ధ యువకులు వాళ్లిద్దరు. సంక్షుభిత సమాజంలో కొన్ని రోజులు మనుషులు మనుషుల్లా బతకడానికి ఆక్సిజన్ ఇచ్చారిద్దరు. కొన్ని కథలు, ఇంకొన్ని బొమ్మలు, మరికొన్ని కన్నీళ్లు కలిపిన జుగుల్‌బందీ జీవితాలు వాళ్లవి. ఆ ఇద్దరికి ప్రపంచాన్ని ప్రేమించడం మాత్రమే తెలుసు. దశాబ్దాల క్రితమే ఈ లోకంలో కళ్లు తెరిచినా మహానగరంలో ఇప్పటికీ పురిటికందు వాసనతో అక్కడక్కడా మసులుతూనే ఉంటారు. వాళ్లిద్దరు ఒడ్డున పడ్డ చేప పిల్లలు కాదు. వాళ్లు ఎక్కడున్నా అక్కడ ఓ సంద్రం తనలో తాను ఈదులాడుతూ ఉంటుంది. మరో నది నవ్వుతూ చల్లగా పారుతూంటుంది. ఓ పిల్ల కాలువకు పరవళ్లు తొక్కడం ఎలాగో నేర్పించే సృజనకారులు వాళ్లిద్దరు.

ఆ నీలినగరిలో ఓ పల్లెటూరి పిల్లగాడు ఈ తల్లావఝుల శివాజీ. నారాయణగూడ మురికి మూసీ ఒడ్డున అరటి ఆకులు కోసుకుంటూ పాతబస్తీలో ప్రత్యక్షమైన ఆ కుర్రాడు చేదు బాల్యానికి ప్రతీక. చార్మినార్ సిగరెట్లు వదిలిన పొగని వొళ్లంతా పట్టించుకుని రామ్‌నగర్ సెంటర్లో బస్తీ మే సవాల్ అంటూ బతికిన యవ్వనం ఈ శివాజీది. ఉదయాస్తమయాల చీకటి వెలుగుల మధ్య కొన్ని గంటల్ని ఖాళీ కడుపుకోసం విక్రయించిన చిత్రకారుడు ఇతడే. చొక్కాకంటుకున్న వారపత్రిక బ్రోమైడ్లను పురాణాల ముందు విప్పేసి

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

చౌరాసియా రాగంలో తరించింది ఈ శివాజీనే. ఉదయం దినపత్రిక కార్యాలయం గేటు ఎదురుగా ప్రతినెలా పదో తారీఖున చేతక్ మీద కూర్చున్న చిమ్మ చీకటి వడ్డీ కాసుల వాడికి నెల కష్టాన్ని ఇచ్చేసి వొట్టి చేతులతో ఇంటికి వెళ్లిందీ ఈ శివాజీనే. వాళ్ళంతా కళాకారులే. జన్మించడమే ఇంతింత గడ్డాలతో. అర్టు తప్ప తక్కినదంతా బోలెడంత అజ్ఞానంతో గడిపిన జీవితాలు. చింతపండుని లీటర్లలో అమ్ముతారని భ్రమించి పర్యావరణంకోసం గుడ్డ సంచులు ఓ చేత్తో, చిత్ర ప్రసాద్ బొమ్మల పుస్తకాన్ని మరో చేత్తో పట్టుకుని ఊరేగిన వాళ్లు. వెనక్కి తిరిగిన పాదాలతో నడుస్తున్న వారితో స్నేహించి మోసపోయిన వారి జాబితాలో తొట్ట తొలిపేరు రాయించుకున్న అచిత్రకారుడు ఈ తల్లావఝుల శివాజీ. ఇతగాడి జన్మ సార్థకమై ఓ ఏభై ఏళ్లు అయ్యింది. సంగీత, సాహిత్య, చిత్ర, శిల్ప కళారంగాలలో చేతితో పాటు కళ్లు, నోరు కూడా మెలికలు తిరిగిపోయి వేలాది తెల్ల కేశాలు మిగిలాయి తెల్లమోహం వేస్తూ... ఇదిగో ఇన్నాళ్లకి అర్టుకి ఏలికల హార్టు తోడై మేం గుర్తించాం... అంటూ తెలుగు వారికి వినిపించేలా చెప్పింది. ఇది తెలిసాక శివాజీకి ఫోన్ చేస్తే "ఏలికలిచ్చే ఆ రూకల బహుమతి తెచ్చుకోవడం నాకు రాదబ్బా. పడేస్తానేమోనని భయం" అన్నారు శివాజీ అవతలి గొంతులో. "బాబోరే శివాజీ" అని మనసులో అనుకుని... పైకి మాత్రం "వారిచ్చేది చెక్కురా నాయనా... పోయినా పరవాలేదు" అని మాయలోకం గురించి అమాయకుడికి చెప్పాల్సి వచ్చింది. శివాజీకి ఇంచుమించు సరిసాటి మహ్మద్ ఖదీర్ బాబు. కథకుడు. కథా కార్యకర్త. కథలు రాయడమే కాదు... తిరిగి చెప్పగల సామర్థ్యం (రీటోల్డ్ స్టోరీస్ ఈ మామ రాసిందే) ఉన్న లౌకికుడు ఈ ఖదీర్ బాబు. వస్తానని మాటిచ్చి రాకపోతే అతగాడి ఫోన్‌లో నుంచి నీ నంబర్ అమాంతంగా మాయం చేయగల ప్రేమికుడు. హైదరాబాద్ చూడడానికి పల్లెటూరినుంచి వచ్చిన అన్న తిరిగి ఊరెళ్లే వరకూ ఇల్లు కదలకుండా ఇంట్లో భయం, భయంగా గడపడం వెనుక రహస్యం తెలిసింది ఈ ఖదీర్ మామకే. పదో తరగతి పరీక్షలకోసం తీయించుకున్న ఆనాటి నా ఫొటోలో కాండూరి మురళిగాడు ఎందుకు కనిపించాడో, మా అమలాపురంలో ప్రతి వీధి దర్గామిట్టలా ఎందుకు మారిందనే రహస్యం కూడా ఖదీర్ మామకి తెలిసినంతగా చదివే వాళ్లకి తెలియలేదు. ఈ ఖదీర్‌ను కలవడానికి వాళ్లింటికి వెళ్తే హాలులో ఆ పాత బాలీవుడ్ నటీ నటులందరూ బాసంపట్టు వేసుకుని కూర్చుంటారు. ఉత్తరాది షెహనాయ్‌లు, దక్షిణాది వీణలు, పాత హార్మోనియం పెట్టెలు రాగాలను సరిదిద్దుకునేది ఈ ఖదీర్ బాబు వసారాలోనే. కథలు చదివి మురిసిపోవడం కాదు... ఆ మురిపాన్ని పదిమందికి పంచాలనుకుని పగలంతా నీట్‌గా తయారైన వీధి రౌడీలా తిరిగి తిరిగి ఏ నిసిరాతిరో నాలుగు వాక్యాలు వొంపుతాడు. కేతు విశ్వనాథ రెడ్డికి కనిపించిన అమ్మవారి నవ్వుని మరో కంటితో చూసి ఇలా ఉంది ఆ నవ్వు అని చాలెంజ్ చేయడం కూడా ఈ ఎత్తుపళ్ల ఖదీర్‌కే సొంతం. అక్కడితో ఆగితే ఖదీర్ కాదు కదా... అందుకే తాను చేసింది తప్పో, ఆనాటి తన చూపే తప్పో అనుకున్నాడో.... రాసినంత ధైర్యంగానూ తప్పొప్పుకున్న ధీశాలి ఈ తెలుగు సాహిత్యంలో నాకు కనిపించిన ఒకే ఒక్క రచయిత ఖదీర్ బాబే. ఇన్ని అవ లక్షణాలు ఉన్నాయి కనుకే ఇతగాడినీ గుర్తించింది ఏలిక. రెండు దశాబ్దాలకు క్రితమే సికింద్రాబాద్‌లో జరిగిన అతని పెళ్లి నాడు కట్టుకున్న ఆ ముఖమల్ మెరుపుల షేర్వాణీలాగే ఉన్నాడు ఇప్పటికీ. మారిందల్లా ఆనాటి తలరాత.... ఈనాటి చేతిరాత. కుచేలుడు ఇచ్చిన అటుకులు శ్రీకృష్ణుడు తిన్నాడో లేదో నాకైతే తెలియదు కాని, ఎచీవ్‌మెంట్ అంటూ ఇచ్చిన చెక్కుల అటుకుల్ని ఈ ఇద్దరు మాత్రం మహదానందంగా తింటారు. అయితే, ఈ ఇద్దరిని చదివినందుకు, వాళ్లతో కొన్నాళ్లుగా స్నేహించినందుకు తేన్పులు మాత్రం నాకొస్తున్నాయి. మీకు వస్తున్నాయి. గుర్తించలేదంతే. బ్రేవ్...

(తల్లావఝుల శివాజీకి, మహ్మద్ ఖదీర్ బాబుకి ఏపీ ప్రభుత్వం ఎచీవ్‌మెంట్ అవార్డులు ఇస్తోంది. ఆ నా మిత్రులకు ఈ నాలుగు మాటలు)

సీనియర్ జర్నలిస్టు, ఫోన్: 9120 19929

పోరుబాటలో ఏఐటీయూసీ ఉజ్వల చరిత్ర

చలసాని వెంకటరామారావు

భారతదేశంలో స్వాతంత్ర్యానికి ముందే కార్మికులు సమస్యల పరిష్కారానికి, స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనేందుకు 1920లో స్థాపించిన ఏఐటీయూసిది ఉజ్వల చరిత్ర. అమెరికాలోని చికాగో నగరంలో 1886 మే నెలలో 8గంటల పని దినం కోసం కార్మికులు సమ్మె చేశారు. దానికి 24 ఏళ్ళ ముందే భారతదేశంలోని హౌరా రైల్వే స్టేషన్లకు సంబంధించిన పారిశ్రామిక కార్మిక సమ్మె 1862 ఏప్రిల్, మే నెలల్లో జరిగింది. 1200 మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. 1823 లో కలకత్తా పల్లకీ బోయీలు, 1853లో నదిపై సరకులు రవాణా పోర్టర్లు, 1862లో ఎద్దుల బండ్లు తోలేవారు కలకత్తాలో సమ్మెల నుండి 1905లోనే బెంగాల్ ప్రెస్ వర్కర్సు యూనియన్ ఏర్పడి సమ్మెలు చేశాయి. 1906లో ఇండియన్ టెలిగ్రాఫ్ అసోసియేషన్- కలకత్తా, బోంబే పోస్టుమెన్స్ యూనియన్- 1907 వంటి కార్మిక సంఘాలు ఏర్పడిన చరిత్రమనది..

బాల గంగాధర తిలక్ ఇంగ్లండులో ఉన్నప్పుడు బ్రిటీష్ ట్రేడ్ యూనియన్స్ లేబరు పార్టీలతో సంబంధాలవల్ల కార్మికవర్గంపై విశాల దృక్పధం అలవర్చుకున్నాడు. బొంబాయి తిరిగి వచ్చి కార్మికోద్యమాన్ని నిర్మించాడు. తిలక్ కార్మిక సంబంధాలు, శ్రమ జీవులను సంఘటితం చేయాలనే ఆలోచనల నుండి ఏఐటీయూసీ ఆవిర్భవించింది. 1920 ఆగస్టు 22న దీని నిమిత్తం బొంబాయిసభ ఏర్పాటు చేశారు. కాని ఆగస్టు 1న తిలక్ మరణించటంతో అక్టోబరు31 నుంచి నవంబరు 2 వరకు ఏఐటీయూసీ వ్యవస్థాపక లాలా లజపతిరాయ్ అధ్యక్షతన బొంబాయిలో జరిగింది. జాతీయోద్యమ నాయకులు, కార్మిక ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు ఈ సభలో పాల్గొన్నారు. సభకు ముందు బొగ్గు గనుల పాలిత ఝరియా (బీహారు) లో 1921 నవంబరు 30 న జరిగింది. ఈ సభలో సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం దివాన్ చమన్‌లాల్ ప్రతిపాదించగా ఆమోదించడమైంది. ఈ సభలో ఒక నిర్మాణ స్వరూపం ఏఐటీయూసీకి ఏర్పడింది. భారత దేశంలో సోషలిస్టు రాజ్యస్థాపన, దేశ స్వాతంత్ర్యం, వర్గ దృక్పధంతో కార్మిక హక్కుల సాధన, అంతర్జాతీయ కార్మిక సంఘీభావం, కార్మికులను స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధంచేయటం లక్ష్యాలుగా ప్రకటించారు. 1917 రష్యన్ విప్లవ ప్రభావం, 1919 కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రభావం, పెట్టుబడీదారీ దేశాలలో శ్రామిక విముక్తి పోరాటాలు, 1929 ఆర్థిక మాంద్యం పరిస్థితులు, పెట్టుబడిదారులు అత్యాశతో కార్మికుల జీతాలు తగ్గించటం, కార్మికులపై దాడులు, ఉపాధి క్షీణత, ఆర్థిక వ్యవస్థ బలహీనపడటం వంటి అంశాలు భారత కార్మికవర్గాన్ని ప్రభావితం చేశాయి. ఏ.ఐ.టీ.యూ.సీ. ఏర్పడిన తరువాత దేశవ్యాపితంగా పెద్ద సంఖ్యలో కార్మికసంఘాల నిర్మాణం జరిగి తమ హక్కుల సాధనకు కార్మికులు దీర్ఘకాలిక సమ్మెలు చేశారు. జంషెడ్‌పూర్‌లోని టాటా ఇనుము ఉక్కు కర్మాగారంలో 1922 సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 23 వరకు సమ్మె జరిగింది. సూరత్‌లోని మూడువేలమంది కార్మికులు బోనస్‌కై సమ్మె చేశారు. 200 మందిని ఉద్యోగాల నుండి తొలగించారు. అహ్మదాబాద్ 56 మిల్లులలోని 43 వేల మంది వేతనాలలో 20 శాతం కోతకు నిరసనగా రెండు నెలల పాటు సమ్మె చేశారు. 24 లక్షల పని దినాల నష్టం జరిగింది. 16 శాతం కోతతో ఒప్పందం జరిగింది. 1924 జనవరి 17 నుండి రెండు నెలలపాటు బొంబాయి టెక్స్టైల్ కార్మికులు లక్షా 60వేలమందితో సమ్మె చేశారు. ఈ సమ్మె రక్తసిక్తం అయ్యింది. వేతనాలలో ఆహార అలవెన్సులలో కోత విధించారు. 1925 సెప్టెంబరులో తిరిగి సమ్మెచేసి కోర్కెలు సాధించుకున్నారు. 1923 సమ్మె తర్వాత 'గిర్ని సంఘ కాంగార్' స్థాపించడమైంది. 1926లో బొంబాయి టెక్స్టైల్ లేబరుసంఘ్ స్థాపించారు. 1926 ట్రేడ్‌యూనియన్ల రిజిస్ట్రేషన్ ప్రకారం ఇది మొట్టమొదటి రిజిష్టర్డు ట్రేడ్ యూనియన్. 1928 సమ్మె తర్వాత జౌళి కార్మికుల పోరాట సంస్థ 'గిర్ని కాంగార్ యూనియన్' ఏర్పడింది. 1920 నుండి 25 వరకు సాగిన కార్మిక పోరాటాల ఫలితంగా ప్రభుత్వం "వర్క్‌మెన్స్ కాంపెన్సేషన్ యాక్టు–1923', ట్రేడ్ యూనియన్స్ యాక్టు–1926 తీసుకు వచ్చింది. 1925 డిసెంబరు 25న భారత కమ్యూనిస్టు పార్టీ కాన్పూరులో స్థాపించడమైంది. అప్పటినుండి కమ్యునిస్టులు ట్రేడ్ యూనియన్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టిపెట్టారు. కమ్యునిస్టుల ప్రాధాన్యం కార్మికవర్గంలో పెరిగి దేశవ్యాప్తంగా బ్రహ్మాండమైన కార్మిక సమ్మెలు జరిగారు. 1927 ఫిబ్రవరి 3న బొంబాయిలో 30 వేలమంది కార్మికులు సైమన్ వ్యతిరేక ప్రదర్శన చేశారు. నికృష్ట జీతాలు, కార్మికులపై దాడులు, రిట్రెంచ్ మెంట్లు, యూనియన్ల గుర్తింపు, కనీసవేతనం, యూరోపియన్ అధికార వివక్షకు వ్యతిరేకంగా కనీవినీ ఎరుగని రీతిలో సమ్మె పోరాటాలు జరిగాయి. 1927 ఫిబ్రవరిలో బెంగాల్- నాగపూర్ రైల్వే కార్మికుల సమ్మెలో 26 వేలమంది పాల్గొన్నారు. 40 మంది కార్మికులు బులెట్లు, బాయ్‌నెట్ల వల్ల గాయపడ్డారు. ఈస్టిండియా రైల్వే కార్మికులు - కలకత్తా సమ్మెలో ఇద్దరు కార్మికులు కాల్పులలో చనిపోయారు. 1928 జులైలో దక్షిణ భారత రైల్వే సమ్మెలో కార్మికులు వీరోచితంగా ప్రభుత్వ సాయుధ దళాలను ప్రతిఘటించారు. గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వేలో ఇద్దరు కార్మికులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. నిజాం గారెంటెడ్ స్టేట్ రైల్వేలో కూడా సమ్మె జరిగింది. 1928 బొంబాయి జౌళి కార్మికుల ప్రధమ సార్వత్రిక సమ్మె జరిగింది. "రేషనలైజేషన్ స్కీం" వ్యతిరేకిస్తూ ఆరు నెలలు ఈ సమ్మె సాగింది. ఈ సమ్మె గిర్ని కాంగార్ యూనియన్ స్థాపనకు దారితీసింది. 1929లో 29 రోజుల పాటు మరో సమ్మె జరిగింది. అనేకమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. 1928–29 లో బెంగాల్ జనపనార కార్మికుల మొదటి సమ్మె జరిగింది. జనపనార పరిశ్రమ బ్రిటీష్ పెట్టుబడిదారులకు అపార లాభాలను తెచ్చిపెట్టింది. కానీ కార్మికులు కడు దయనీయస్థితిని అనుభవించారు. తాతా ఇనుము ఉక్కు కర్మాగారంలో 1928 ఏప్రియల్ 18 నుండి సెప్టెంబరు మధ్య వరకు సమ్మె జరిగింది. మహాత్మాగాంధీ ఒప్పందం కుదిర్చినా కార్మికులకు సంతృప్తి కలగలేదు. సమ్మెచేస్తున్న కార్మికులను డిస్మిస్ చేశారు. తర్వాత సుభాష్ చంద్రబోసు ఒప్పందం కుదిర్చినా కార్మికులు తృప్తి పడలేదు. 1929 మార్చిలో బొంబాయి కార్మికుల సార్వత్రిక సమ్మె జరిగింది. 31 మంది ట్రేడ్ యూనియన్, రైతు నాయకులను అరెస్టుచేసి ప్రభుత్వం మీరట్ కుట్రకేసు బనాయించింది. నాల్గున్నర సంవత్సరాలు విచారణజరిపి, పలువురికి ద్వీపాంతర శాశ్వత కఠిన కారాగారశిక్ష విధించారు. కమ్యూనిస్టు భావాల వ్యక్తిని నిరోధించి, ట్రేడ్‌యూనియన్ల శక్తిని తగ్గించే ప్రయత్నం ప్రభుత్వం చేసింది, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో బ్రహ్మాండమైన కార్మిక పోరాటాలు జరిగాయి. ఈ కాలంలో కార్మికనేతల పరిస్థితి బాగా దిగజారిపోయింది. పనిగంటలు పెంచి, జీతాలు తగ్గించారు. యంత్రాల వేగం పెంచారు. టీ తోట కార్మికులతో బానిసల్లా పనిచేయించారు. పెట్టుబడి దారులు లాభాలు దండుకున్నారు. బొంబాయి, కన్పూరు, కలకత్తా, బెంగుళూరు, జంషెడ్ పూర్, ధనాబాద్, ఝరియా, నాగపూరు, మద్రాసు, అస్సాంలో దేశమంతా కార్మిక సమ్మె పోరాటాలు జరిగాయి. క్విట్ ఇండియా ఉద్యమంలో, నావికా తిరుగుబాటులో బొంబాయి వీధులు రక్తసిక్తం అయ్యాయి. 1947 స్వాతంత్ర్యానంతరం పాలకుల పెట్టుబడిదారీవర్గ అనుకూల విధానాలకు నిరసనగా కార్మికులను జైళ్ళకు పంపారు. 1960 జూలైలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె జరిగింది. ఈ సమ్మెలో జరిగిన పోలీసు కాల్పులలో పెక్కుమంది చనిపోయారు. 20 వేలమందిని అరెస్టు చేశారు. కార్మికుల హక్కులు హరించేందుకు వివిధచట్టాలు మార్చివేశారు. బ్యాంకుల జాతీయకరణను ఏఐటీయూసీ పోరాడి సాధించింది. 1981 నుండి దేశంలో ఐక్య కార్మికోద్యమానికి బీజాలు పడ్డాయి. 1991 ఆర్థిక సంస్కరణలకు నిరసనగా ఐక్యకార్మికోద్యమం విస్తరించింది. 20 దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెలు జరిగాయి. నూతన ఆర్థిక విధానాలు, సమ్మె హక్కుకై సమ్మె వంటి పోరాటాలు జరిగాయి. 2014 నుండి మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు సాగుతున్నది. ఈ అన్ని పోరాటాలలో ఏఐటీయూసీ ఒక సమరశీల చోదకశక్తిగా పని చేస్తున్నది. ఏఐటీయూసీ 104 ఎళ్ళ ఉజ్వల చరిత్రలో ఎన్నో మరుపురాని ఘట్టాలు ఉన్నాయి. అశేష త్యాగాలు ఉన్నాయి. భారతదేశంలోని ఏఐటీయూసీ ప్రభావానికి లోనుగాని కార్మిక వ్యవస్థ ఏదీ లేదంటే అతిశయోక్తి కాదు. 104వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కార్మిక లోకానికి శుభాకాంక్షలు. భవిష్యత్‌లో పోరాటాలకు కార్మిక వర్గం సన్నద్ధం కావాలి.

(అక్టోబరు 31 ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా)

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు
ఫోన్ : 9490952093

వాగ్దానాలు అమలు చేయని మోదీ ప్రభుత్వం!

బొల్లిముంత సాంబశివరావు

మోదీ నాయకత్వాన ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం తన తొమ్మిది సంవత్సరాల పాలనలో చేసిన వాగ్దానాల అమల్లో ఘోరంగా విఫలమైంది. ప్రజల మౌలిక సమస్యల పరిష్కార జోలికి పోకుండా దేశ, విదేశీ బడా పెట్టుబడిదారుల, బహుళ జాతిసంస్థల ప్రయోజనాలే ముఖ్యంగా పాలన సాగిస్తున్నది. దేశ సహజ సంపదలను కార్పొరేట్ల పరం చేస్తున్నది. దేశాన్ని అప్పులమయంగా తయారుచేసి ప్రజలపై మోయలేని భారాన్ని మోపింది. పేదరికం, నిరుద్యోగం, ఉపాధి లేమితో ప్రజలు అల్లాడుతున్నారు. వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతున్నది. అన్ని రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నది.

అనకొండలా పెరుగుతున్న అప్పులు: తాము అధికారంలోకి వస్తే విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి ఇంటికి 15లక్షల రూపాయలు అందచేస్తామని ప్రకటించారు. డబ్బులు మాత్రం ఇవ్వలేదుగాని, ప్రజలపై తలసరి రుణభారం మాత్రం మోపారు. దేశంలో దేశీయ, విదేశీ అప్పులు అనకొండలా పెరుగుతున్నాయి. 2014 మార్చి 31 నాటికి ప్రభుత్వాలు చేసిన అప్పు 55.87 లక్షల కోట్లు. మోదీ ప్రభుత్వ 9సంవత్సరాల పాలనలో దాదాపు 100 లక్షల కోట్ల కొత్త అప్పులు భారత ప్రజలపై పడింది 2022 చివరినాటికి భారతదేశ అప్పులు 152.17 లక్షల కోట్లకు చేరుకుంటాయని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించింది. 2022 చివరినాటికి భారతదేశం చేసిన విదేశీ రుణాలు 4.94 లక్షల కోట్లుగా ఉన్నాయని రిజర్వుబ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ తెలిపింది. పాలకులు చేసిన అప్పుల ఫలితంగా 2014లో ఉన్న భారతదేశ తలసరి అప్పు 4.30లక్షల ఉంటే 2022 నాటికి 11లక్షలకు చేరుకుంటుంది.

ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణ: గత ప్రభుత్వాలు తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలనైనా కొనసాగించాయి. ఎన్‌డీఏ నాయకత్వాన మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను తెగబడి అమ్ముతున్నది. అనేక సంస్థలను ప్రైవేటీకరిస్తున్నది. ప్రభుత్వ రంగ సంస్థలంటే వ్యాపార సంస్థలు కాదని, ప్రజల ప్రయోజనాల కోసం ఏర్పడ్డవనే జ్ఞానం కూడా మోదీ ప్రభుత్వానికి లోపించినది. సమాజ సంపుష్టితత్వం కోసం ప్రధాన రంగాలన్నీ ప్రభుత్వ అజమాయిషీలో ఉంటేనే ప్రజల అభివృద్ధి సాధ్యమని సామాజిక ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. సంపద సృష్టికి ప్రభుత్వ రంగం చేపట్టిన దారులు, కార్మికవర్గం ధారపోసిన నెత్తురే కారణమన్న చారిత్రక సత్యాన్ని కావాలనే మోదీ ప్రభుత్వం వ్యతిరేకించటమే కాకుండా పెట్టుబడిదారులే సంపద సృష్టి కర్తలని వారికి సాగిలపడుతున్నది. 1951 నాటికి కేవలం ప్రభుత్వ రంగ సంస్థలు ఐదు మాత్రమే ఉన్నప్పటికీ క్రమంగా 1991 నాటికి 246కి పెరిగాయి. దేశంలోని వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు 2017–18 ఆర్థిక సంవత్సరంలో 20,23732 ఆదాయాన్ని సమకూర్చి, రూ.1,59,635 కోట్లు లాభాలు ఆర్జించాయి. పన్నుల రూపంలో ప్రభుత్వానికి 3,50,052 కోట్లు చెల్లించాయి. పాలక ప్రభుత్వాలు సక్రమమైన విధానాలు అమలు జరిపితే ప్రభుత్వ రంగ సంస్థలు లాభాలు గడిస్తాయనే దానికి ఇదే నిదర్శనం. మోదీ నాయకత్వాన ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వానికి బడా పెట్టుబడిదారులకు సేవచేయటం తప్ప ప్రజల సంక్షేమం గురించిన ఆలోచనే లేదు. ప్రభుత్వరంగ మంటేనే దానికి గిట్టదు. అధికారంలోకి వచ్చిన దగ్గరనుండి ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను బడా పెట్టుబడిదారుల పరం చేసే విధానాలు అమలు జరుపుతున్నది. 2016లో నీతిఅయోగ్ ద్వారా ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణను ప్రతిపాదించింది. దాని ప్రతిపాదనలకు అనుగుణంగా ఆయా సంస్థల్లో 100శాతం

పెట్టుబడులు అమ్మేందుకు 2017లో మోదీ ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వ రంగ సంస్థలను పునర్ వ్యవస్థీకరించటం, నష్టాల పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను వదిలించుకోటానికి మొదట పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణలను ఒక విధానంగా మోదీ ప్రభుత్వం అమలు జరిపింది. లాభాల్లో ఉన్న సంస్థలను కూడా అమ్మకాలకు పెడుతున్నది. అన్నీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 100శాతం పెట్టుబడుల ఉపసంహరణ దిశగా మోదీ ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తున్నది. బిపిసిఎల్, ఎయిర్ ఇండియా, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కంటైనర్ కార్పొరేషన్, ఐడిబిఐ బ్యాంక్, బిఇఎంఎల్ తదితర సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణకు రంగం సిద్ధమైంది. ఎల్‌ఐసిలో కూడా ప్రైవేట్ పెట్టుబడులకు అనుమతించింది. లాభాల్లో ఉన్న సింగరేణి బొగ్గు గనులను, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తున్నట్లు ప్రకటించింది. మోదీ ప్రభుత్వం ఏ రంగాన్ని ప్రైవేటీకరణ నుండి మినహాయింపు ఇవ్వలేదు. 150 జతల ప్రయాణీకుల రైళ్లను ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిపేనదుకు, ప్రైవేట్ సంస్థల నుంచి రైల్వేశాఖ బిడ్స్ ను ఆహ్వానించింది. దీని ద్వారా 30వేల కోట్లను రైల్వేశాఖ పొందుతున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ప్రైవేట్ భాగస్వామ్యంతో అనేక రైళ్లు నడుస్తున్నాయి. ఎరువుల పరిశ్రమలు: వ్యవసాయరంగంలో ఎరువుల పాత్ర కీలకమైంది. ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధింటంలో నేటికీ పాలక ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయి. సగానికిపైగా ఎరువులు విదేశాల నుండి దిగుమతి అవుతున్నాయి. ఎరువుల పరిశ్రమలకే ధరల నిర్ణయం అప్పగించటం వలన వాటి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దేశీయ పరిశ్రమలు విస్తరించే విధానాలు అమలు జరపకపోగా ఉన్న వాటిని కూడా ప్రైవేటీకరణకు పూనుకుంది. ప్రైవేటీకరించే ఎరువుల సంస్థల్లో రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్), నేషనల్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, బ్రహ్మపుత్ర వ్యాలీ ఫర్టిలైజర్స్, కార్పొరేషన్ లిమిటెడ్, ఎల్‌సీఐ అమరావతి జిప్సం అండ్ మినరల్స్, మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, ఫర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావన్ కోర్ (ఎఫ్ ఏ సీ టీ), హిందూస్థాన్ ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్‌లు ఉన్నాయి. దేశంలో అనేక మంది ప్రధాన మంత్రులుగా పనిచేశారు. ఎవరి పాలనలో ఎన్ని సంస్థలు మూసివేయించారన్నది గమనిస్తే, వాజ్‌పాయ్ పాలనలో 7 పరిశ్రమలు, మన్మోహన్ సింగ్ పాలనలో మూడు, మోదీ పాలనలో 23 సంస్థలు మూసి వేశారు. 1991–92 నుండి 2018–19 వరకు 3,47,493 కోట్లు పరిశ్రమల వాటాల అమ్మకం ద్వారా ప్రభుత్వాలు సాధించాయి. 27 ప్రభుత్వ రంగ సంస్థలు పూర్తిగా మూసివేయించారు. 2003లో అల్యూమినియం కంపెనీలో వాజ్‌పేయి ప్రభుత్వం 5వేల కోట్ల విలువైన 51శాతం వాటాలను కేవలం 551 కోట్లకు అమ్మివేసింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ లో 20వేల కోట్ల విలువైన 10శాతం వాటాలను 4,889 కోట్ల రూపాయలుగా చూపెట్టి మోదీ ప్రభుత్వం అమ్మకాలకు పెట్టింది. పరిశ్రమల అమ్మకం ద్వారా లక్షల కోట్ల రూపాయల ఆర్జనే ధ్యేయంగా మోదీ ప్రభుత్వం పెట్టుకుంది. అసలు ప్రభుత్వ రంగ పరిశ్రమలే ఉండగూడదన్నది మోదీ ప్రభుత్వ విధానంగా ఉంది. ఉద్యోగాల మాట తప్పటం: ఎన్‌డీఏ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని చెప్పింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాట మోదీ నోటి నుండి రాలేదు. ఎన్‌డీఏ వాగ్దానం ప్రకారం 9 సంవత్సరాల్లో 18కోట్ల ఉద్యోగాలు నిరుద్యోగులకు రావాల్సి ఉంది. ఉద్యోగ కల్పనలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నది. నిరుద్యోగం 47 సంవత్సరాల నాటి గరిష్టానికి చేరుకుంది. 18–25 సంవత్సరాల మధ్య పట్టభద్రుల్లో నిరుద్యోగం 42శాతానికి చేరింది. ఇటీవల అజీజ్ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. దేశ గ్రామీణ జనాభా లో 2023 లెక్కల ప్రకారం 40శాతం కూలీలుగానే ఉన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు కలగానే మిగిలింది పంటలకు గిట్టుబాటు ధర, దాని చట్టబద్ధత ఊసేలేదు. రైతుల ఆత్మహత్యలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. రైతలకు రుణమాఫీ చేయటం సరైన విధానం కాదని చెప్పే మోదీ బ్యాంకులకు వేలకోట్లు ఎగనామం పెట్టిన కార్పొరేట్ గద్దలపై జాలిపడి 13లక్షల కోట్ల రుణాలు రైటాఫ్‌చేసి వారి రుణం తీర్చుకున్నాడు. మోదీ పాలనలో పేదరికం, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రజల ఏ సమస్య పరిష్కారం కాలేదు. ప్రజలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. దేశ సంపద కొద్దిమంది వద్ద పోగుపడుతున్నది. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించటమే సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

సెల్: 9885983526

జ్ఞాపికల వేలానికి అద్భుత స్పందన : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ : సంవత్సరాలుగా తనకు లభించిన మెమెంటోల వేలానికి అద్భుతమైన స్పందన రావడంతో తాను నిజంగా ఉప్పొంగిపోతున్నానని, ప్రజలు పాల్గొని తమ బిడ్‌లను వేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం కోరారు. మొధేరాలోని సూర్య దేవాలయం, చిత్తోర్‌గఢ్‌కు చెందిన విజయ్ స్తంభం, చంబా రుమాల్, పట్టచిత్ర, వారణాసి ఘాట్‌ను వర్ణించే గొప్ప పెయింటింగ్ ఈ 912 వస్తువులలో ప్రధానమైన బహుమతులు, మెమెంటోల తాజా దఫా ఇ-వేలంలో భాగంగా ఉన్నాయి. 'సంవత్సరాలుగా నేను అందుకున్న మెమెంటోల వేలానికి అద్భుతమైన స్పందన రావడంతో నేను నిజంగా ఉప్పొంగిపోయాను' అని మోదీ అన్నారు. 'మీకు తెలిసినట్లుగా, ఆదాయం నమామి గంగేకి అంకితం చేయబడింది. నేను అందుకున్న కొన్ని ప్రత్యేకమైన మెమెంటోల కోసం ప్రతి ఒక్కరూ వేలంలో పాల్గొనాలని ప్రోత్సహిస్తున్నాను' అని తెలిపారు. రామ్ దర్బార్ విగ్రహం, అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం నమూనా, కామధేను, జెరూసలేం సావనీర్ కూడా ప్రధాన మంత్రి మోదీకి ఇచ్చిన బహుమతులు, మెమెంటోల తాజా దఫా ఇ-వేలంలో ప్రముఖ వస్తువులలో ఉన్నాయి. అక్టోబరు 2న ప్రారంభమైన ఈ-వేలం ఈ నెలాఖరుతో ముగియనుంది.

బీజేపీకి ఎదురుదెబ్బ

తిరుగుబాటు నేత సొంతపార్టీ ఏర్పాటు

వీజేపీ పేరుతో 25 మంది అభ్యర్థుల ప్రకటన

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల వేళ భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. మంత్రి నారాయణ్ త్రిపాఠి బీజేపీపై తిరుగుబాటు బావుటా ఎగురవేసి సొంత పార్టీ ఏర్పాటు చేశారు. 'వింధ్య జనతా పార్టీ' (వీజేపీ) పేరుతో పార్టీని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 25 మంది అభ్యర్థుల జాబితాను సైతం శుక్రవారం విడుదల చేశారు. మైహర్ అసెంబ్లీ నియోజవర్గం నుంచి నారాయణ్ రాణే పోటీ చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో వీజేపీ 40 మంది అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్టు మీడియాతో మాట్లాడుతూ త్రిపాఠి చెప్పారు. 25 మంది అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేశామని, మరో 15 మంది అభ్యర్థుల జాబితాను త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. వింధ్య ప్రాంతం మధ్యప్రదేశ్ అభివృద్ధికి చాలా కీలకమని, వింధ్య అంశాన్ని ప్రతిసారి తాను లేవనెత్తుతూనే ఉన్నానని చెప్పారు. ఆ మాట తాను ప్రస్తావించినప్పుడల్లా తనను రెబల్‌గా బీజేపీ చూసేదని, ఆ కారణంగానే తాను వింధ్య ప్రాంతం అభివృద్ధి కోసం నడుంబిగించానని తెలిపారు. చివరి నిమిషంలో ఆయన విజేపీ పేరును నమోదు చేశారు. వింధ్య ప్రాంత ప్రజలు మోసానిక గురవుతున్నారని, వారి అభివృద్ధికి ఏ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు.

గత 20 ఏళ్లుగా బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ వింధ్య ప్రాంతం విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తప్పుపట్టారు. ఈ ప్రాంతంలో అనేక వనరులు ఉన్నప్పటికీ ప్రజలకు ఉద్యోగాల్లేవన్నారు. వింధ్యప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా తమ పార్టీ ఉద్యమిస్తుందని చెప్పారు. వింధ్యప్రదేశ్ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌పై బీజేపీ సుముఖంగా లేదన్నారు. ప్రత్యేక వింధ్యప్రదేశ్ రాష్ట్రం ఆలోచనను కాంగ్రెస్ పార్టీతోనూ త్రిపాఠి పంచుకున్నట్టు తెలుస్తోంది. ఈ అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని ఆయన కోరినప్పటికీ కాంగ్రెస్ నిరాకరించినట్టు చెబుతున్నారు. దీంతో త్రిపాఠి సొంత పార్టీని ఏర్పాటు చేయడంతో పాటు పార్టీ అభ్యర్థులను నిలబెట్టారని తెలుస్తోంది.

ముందు జీతాలు పెంచండి... ఆ తర్వాత సలహాలివ్వండి

ఇన్ఫోసిస్ నారాయణమూర్తిపై విమర్శల వెల్లువ

బెంగళూరు: ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశంలో పని సంస్కృతి మారాల్సిన అవసరం ఉన్నదని, యువత వారానికి 70 గంటలు పనిచేయాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై ఐటీ ఉద్యోగులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ అంశంలో నెటిజన్ల నుంచి సైతం ఆయనకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 'వారానికి 70 గంటలు పనిచేయాలా..? ముందు ఉద్యోగులకు జీతాలు పెంచి ఆ తర్వాత ఇలాంటి సలహాలు ఇవ్వండి..' అంటూ మండిపడుతున్నారు.

'ఇన్ఫీలో ఫ్రెషర్స్‌కు కేవలం 3.5 లక్షలు మాత్రమే జీతంగా ఇస్తున్న ఆయన.. చాలా ఎక్కువ పనిని ఆశిస్తున్నారు. ముందు తన కంపెనీలో పనిచేసే ఉద్యోగుల జీతాలు పెంచి.. తర్వాత ఇలాంటి సలహాలు ఇస్తే బాగుంటుంది' అని చురకలంటిస్తున్నారు. 'వారానికి 6 రోజులు.. రోజుకు 12 గంటలు. దీనికి అదనంగా రోజులో 2 గంటలు ప్రయాణానికి, గంట ప్రిపరేషన్‌కి సరిపోతుంది. క్లైంట్స్ నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేసే ఐటీ సంస్థలు.. ఉద్యోగులకు మాత్రం నామమాత్రపు జీతాలను చిల్లరగా పడేస్తున్నాయి', 'వారానికి 70 గంటలు పనిచేస్తే.. సగం జీవితం ఉద్యోగంతోనే సరిపోతుంది. మరి కుటుంబ పరిస్థితి ఏంటి..? ఎక్కువ పని ఆశించే ఐటీ సంస్థలు తమ ఉద్యోగుల జీవితాన్ని, ఆరోగ్య పరిస్థితుల గురించి కూడా ఆలోచిస్తే మంచిది', 'ఇప్పటికే అనేక సంస్థలు ఉద్యోగులతో గొడ్డు చాకిరీ చేయించుకుని.. కోట్లకు కోట్లు భారీగా ఆదాయాన్ని అర్జిస్తున్నాయి. కానీ, ఉద్యోగులకు మాత్రం చాలీచాలని జీతాలతో సరిపెడుతున్నాయి', 'నారాయణ మూర్తి తన ప్రకటనతో మహిళలను పని స్థలం నుంచి బయటకు నెట్టేస్తున్నారు. ఇంటి నిర్వహణ, పిల్లలు, కుటుంబ సంరక్షణ భారాన్ని పురుషులు ఎప్పుడూ పంచుకోరు. ఇక వారానికి 70 గంటల పని ఉంటే మహిళలు ఉద్యోగం మానివేయడం తప్ప వేరే మార్గం ఉండదు' అంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ హామీలపై జీఎస్టీ

న్యూఢిల్లీ: కార్పొరేట్ సంస్థలు తమ అనుబంధ సంస్థలకు అందించే గ్యారంటీలపై వస్తు సేవల పన్ను విధించబడుతుందని పేర్కొంటూ ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రులతో కూడిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) మండలి ఈ నెల ప్రారంభంలో కార్పొరేట్ గ్యారెంటీపై 18 శాతం జీఎస్టీ పరిధిలోకి వస్తుందని స్పష్టం చేసింది. అనేక కంపెనీలు సబ్సిడరీలు లేదా గ్రూప్ కంపెనీల నుండి పన్నును తిరిగి పొందలేకపోవచ్చు కాబట్టి పన్ను నిపుణులు గత లావాదేవీలపై జీఎస్టీ విధింపుపై స్పష్టత కోరారు. నోటిఫికేషన్ తేదీ నుండి కార్పొరేట్ గ్యారెంటీపై పన్ను విధించబడుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం జీఎస్టీ నిబంధనలకు సవరణలను నోటిఫై చేసింది. 'అక్టోబర్ 26కి ముందు జరిగిన లావాదేవీలపై ఈ సవరణ ఎటువంటి ప్రభావం చూపదు, తత్ఫలితంగా గత లావాదేవీలతో ముడిపడి ఉన్న పన్ను రిస్క్‌ను కాపాడుతుంది' అని ఏఎంఆర్‌జీ & అసోసియేట్స్ సీనియర్ భాగస్వామి రజత్ మోహన్ తెలిపారు. రుణ ఒప్పందాలలో కార్పొరేట్ గ్యారెంటీలను సమీక్షించేటప్పుడు లేదా పునరుద్ధరించేటప్పుడు కార్పొరేట్ సంస్థలు తమ పన్ను స్థితిని జాగ్రత్తగా అంచనా వేయాలని సూచించారు.

కాలం చెల్లిన ఫోన్లను 2014లోనే విసిరేశారు

కాంగ్రెస్‌పై మోదీ విసుర్లు



న్యూఢిల్లీ: ప్రజలు కాలం చెల్లిన ఫోన్లను 2014లోనే బయట పడేశారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరోక్షంగా కాంగ్రెస్‌పై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బీజేపీ చిత్తుగా ఓడించి అధికారంలోకి వచ్చింది. ఢిల్లీలో జరిగిన 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' ఈవెంట్‌లో ప్రధాని ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, కాలం చెల్లిన ఫోన్లను రీస్టార్ట్ చేసినా, బ్యాటరీకి చార్జింగ్ చేసినా, బ్యాటరీ మార్చినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని, 2014లో ప్రజలు అలాంటి ఫోన్లను వదిలిపెట్టి, దేశానికి సేవ చేసే అవకాశం తమకు ఇచ్చారని చెప్పారు. 2014 సంవత్సరం మార్పునకు సంకేతమని అన్నారు. యాపిల్ నుంచి గూగుల్ వరకూ బడా టెక్ కంపెనీలు దేశంలో తాయారీదారులుగా ఉండేందుకు క్యూలు కడుతున్నారని చెప్పారు. ఇటీవలే గూగల్ తమ ఫిక్సెల్ ఫోన్లను ఇండియాలో తయారు చేస్తున్నట్టు ప్రకటించిందని, శాంసంగ్ 5 మొబైల్ ఫోన్, యాపిల్ ఐఫోన్ 15 ఇండియాలో తయారవుతున్నాయని చెప్పారు. మొబైల్ బ్రాండ్‌బ్యాండ్ స్పీడ్‌లో భారతదేశం 43వ స్థానానికి చేరుకుందన్నారు. క్యాపిటల్ యాక్సిస్, రిసోర్సెస్ యాక్సిస్, టెక్నాలజీ యాక్సిస్ అనేవి తమ ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమాల్లో ఉన్నాయని వివరించారు. ఇవాళ మేడ్ ఇన్ ఇండియా ఫోన్లు ప్రపంచమంతా వాడుతున్నారని, దేశంలో 5జిని విస్తరించడం మాత్రమే కాకుండా, 6జి టెక్నాలజీలో లీడర్‌గా నిలిచేందుకు పురోగమిస్తోందని ప్రధాని తెలిపారు.

బెయిల్ కోసం ఢిల్లీ కోర్టుకు అమిత్ చక్రవర్తి

న్యూఢిల్లీ: ఇటీవల ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా)కింద అరెస్టయిన న్యూస్‌క్లిక్ పోర్టల్ మానవ వనరుల విభాగ అధిపతి అమిత్ చక్రవర్తి బెయిల్ ఇవ్వాల్సిందిగా కోరుతూ ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. చైనా అనుకూల ప్రచారం కోసం న్యూస్ పోర్టల్ (న్యూస్‌క్లిక్)కు డబ్బు అందిందన్న ఆరోపణలపై 'ఉపా' కింద నమోదైన కేసులో న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థతో పాటు చక్రవర్తిని ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం అక్టోబరు 3వ తేదీన అరెస్టు చేసిన సంగతి విదితమే. ప్రబీర్ పుర్కాయస్థ కూడా ఈ కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న తన ఎలక్ట్రానిక్ పరికరాలను అందజేయాలని కోర్టును ఆశ్రయించారు. కాగా ఈ రెండు అభ్యర్థనలను విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి హర్దీప్ కౌర్... చక్రవర్తి బెయిల్ దరఖాస్తుపై కౌంటర్ దాఖలు చేసేందుకు నవంబర్ 4 వరకు, పుర్కాయస్థ దాఖలు చేసిన దరఖాస్తుపై కౌంటర్ ఇచ్చేందుకు అక్టోబర్ 31 వరకు ఢిల్లీ పోలీసులకు సమయం ఇచ్చారు. వీరిద్దరూ అక్టోబర్ 25న పిటిషన్లు దాఖలు చేశారు.

కరువు సాయం చేయరా... కర్నాటకపై ప్రతీకారమా?

కేంద్రంపై సీఎం సిద్ధరామయ్య ఆగ్రహం

బెంగళూరు : రాష్ట్రానికి కరువు సాయం అందించడంలో జాప్యం చేసినందుకు కేంద్రం, ప్రధాని మోదీపై కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కర్నాటకకు కరువు సాయం అందించడంలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ, తమ రాష్ట్రంపై బీజేపీ ప్రభుత్వం 'ప్రతీకారం' తీసుకుంటుందా అని కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించారు. రాష్ట్రంలోని మొత్తం 236 తాలూకాలలో 216 తాలూకాలు కరువు పీడిత ప్రాంతాలుగా ఉన్నాయని, పరిస్థితిని అధ్యయనం చేసేందుకు రాష్ట్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం కూడా దాని గురించి ఒప్పించిందని, అయినప్పటికీ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేదని అన్నారు. సిద్ధరామయ్య సామాజిక వేదిక 'ఎక్స్' లో చేసిన పోస్ట్‌లో... 'రాష్ట్రంలోని 216 తాలూకాలు తీవ్రమైన కరువుతో ప్రభావితమయ్యాయి. ఇప్పటి వరకు కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా పరిహారం విడుదల కాలేదు. ప్రధాని నరేంద్ర మోదీ! ప్రపంచంలోని బాధలు, దుఃఖాల కోసం కొట్టుకునే మీ పెద్ద హృదయం కన్నడిగుల పట్ల ఎందుకు అంత కఠినంగా ఉంది?. మీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం కర్నాటకపై ప్రతీకారం తీర్చుకుంటుందా? ఇది నా ప్రశ్న మాత్రమే కాదు. ఆరున్నర కోట్ల మంది ఆత్మగౌరవ కన్నడిగుల ప్రశ్న' అని ఆయన అన్నారు. 'జవాబు చెప్పండి మోదీ' అనే హ్యాష్ ట్యాగ్‌తో ఆయన ఈ పోస్ట్ చేశారు. కరువు పీడిత కర్నాటక రూ.33,770 కోట్ల నష్టాన్ని చవిచూసిందని, రూ.17,901 కోట్ల సహాయం కోసం విజ్ఞప్తి చేసినప్పటికీ, కేంద్రం మౌనంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ నేతలు కన్నడిగులకు చేసిన బెదిరింపులను గుర్తుచేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్న సిద్ధరామయ్య, 'దాని ఫలితమే ఇప్పుడు మనం చూస్తున్నాం. కర్నాటకకు కరువు సాయం అందించడంపై బీజేపీ ఎంపీలు, కేంద్ర ప్రభుత్వ మంత్రులు ఎందుకు మౌనంగా ఉన్నారు? కన్నడిగులపై వారికి ఉన్న ద్వేషమే కారణమా? మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 224 స్థానాలకుగాను 135 స్థానాలను కైవసం చేసుకుని బీజేపీని కాంగ్రెస్ మట్టికరిపించింది. బీజేపీకి 66, జేడీఎస్‌కు 19 సీట్లు వచ్చాయి.

హిమాచల్ సీఎంకు అస్వస్థత...

ఢిల్లీ ఎయిమ్స్‌లో చికిత్స

షిమ్లా: హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు అస్వస్థతకు గురయ్యారు. ఆయన్ను ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు. వైద్య పరీక్షల కోసం శుక్రవారం సీఎంను ఎయిమ్స్‌కు తీసుకెళ్లినట్లు షిమ్లాలోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్(ఐజీఎంసీ) మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ రావు తెలిపారు. సుఖ్విందర్ సింగ్ బుధవారం అస్వస్థతకు గురవగా, కుటుంబ సభ్యులు ఐజీఎంసీలో చేర్చారు. ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ రావు మాట్లాడుతూ... బుధవారం రాత్రి నుంచి అన్ని రకాల పరీక్షలు చేశాం. కడుపులో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు బయటపడింది. మరిన్ని వైద్యపరీక్షల నిమిత్తం ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించామని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఆరోగ్యం నిలకడగా ఉందని, అన్ని నివేదికలు సాధారణంగానే ఉన్నాయని చెప్పారు. ఇక షిమ్లాలో సీఎంను పరీక్షించిన వైద్యబృందం కూడా ఆయన వెంట ఢిల్లీ వెళ్లింది. ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు గత కొద్దిరోజులుగా విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కొన్నిసార్లు బయట ఆహారం తీసుకోవాల్సి వచ్చింది. దానివల్లే ఆయన ఇన్ఫెక్షన్‌కు గురయ్యారని సుఖు ప్రధాన మీడియా సలహాదారు వెల్లడించారు.

బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో కలిసి వచ్చే వారిని స్వాగతిస్తాం: నానా పటోలే

అకోలా : 2024 లోక్‌సభ ఎన్నికలకు తమ పార్టీ పూర్తిగా సన్నద్ధమైందని, అధికార బీజేపీకి వ్యతిరేకంగా పోరాటంలో తమతో కలిసి వచ్చే వారిని స్వాగతిస్తామని మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే శుక్రవారం తెలిపారు. మహారాష్ట్రలోని అకోలాలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో శివసేన (యూబీటీ), శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) తో కాంగ్రెస్ పొత్తులో ఉన్న పరిస్థితి గురించి మాట్లాడుతూ 'కూటమిలో చేరేందుకు వంచిత్ బహుజన్ అఘాడి (వీబీఏ) అధ్యక్షుడు ప్రకాష్ అంబేద్కర్ నుంచి ఎటువంటి ప్రతిపాదన లేదు. అంబేద్కర్‌తో చర్చకు సిద్ధంగా ఉన్నాం. లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ పూర్తిగా సిద్ధమైంది. అకోలా లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థిని కూడా పార్టీ ఖరారు చేసింది. అకోలా నుంచి పార్టీ అభ్యర్థిగా ఎన్నికైన వ్యక్తి కచ్చితంగా గెలుస్తారని లోక్‌సభ మాజీ ఎంపీ అన్నారు. ఇతర పార్టీల నుంచి నాయకులను చేర్చుకున్నందుకు బీజేపీపై పటోలే విరుచుకుపడ్డారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత భవిష్యత్తు గురించి కాషాయ పార్టీకి ఆందోళన లేదని అన్నారు. 'ప్రభుత్వం పంటల బీమా కంపెనీలకు మాత్రమే మద్దతు ఇస్తోంది, రైతులకు కాదు' అని ఆయన ఆరోపించారు.

గ్యాంగ్‌స్టర్ అన్సారీకి పదేళ్ల జైలు

ఘాజీపూర్: ఉత్తరప్రదేశ్‌లో రాజకీయవేత్తగా మారిన గ్యాంగ్‌స్టర్, మాజీ ఎమ్మెల్యే ముఖ్తార్ అన్సారీకి మరోసారి భారీ షాక్ తగిలింది. హత్య, హత్యాయత్నం కేసుల్లో ముఖ్తార్ అన్సారీని దోషిగా తేల్చిన ఘాజీపూర్ కోర్టు శుక్రవారం పదేళ్ల జైలుశిక్ష, భారీ జరిమానా విధించింది. 2009 గ్యాంగ్‌స్టర్స్ యాక్ట్ కేసులో అన్సారీని గురువారం ఘాజీపూర్ జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి (ఎంపీ-ఎమ్మెల్యే) అరవింద్ మిశ్రా దోషిగా ప్రకటించారు. బందా జైలులో ఉన్న ముఖ్తార్ అన్సారీ విచారణను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన కోర్టు శుక్రవారం తుది తీర్పును వెలువరించింది. అన్సారీ అనుచరుడు, సోనూ యాదవ్‌ను కూడా దోషిగా తేల్చింది. సోనుకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రెండు లక్షల రూపాయల జరిమానా విధించింది. దీనిపై హైకోర్టులో అప్పీలు చేస్తామనీ, తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని ముఖ్తార్ అన్సారీ తరఫు న్యాయవాది లియాఖత్ తెలిపారు. 2009లో కపిల్ దేవ్ సింగ్ హత్యకు కుట్ర పన్నిన ఆరోపణలు వచ్చాయి. దీంతోపాటు మీర్ హసన్ అనే వ్యక్తిపై దాడికి సంబంధించిన మరో కేసు కూడా ఉంది. ఘాజీపూర్‌లోని కరంద పోలీస్ స్టేషన్‌లో ముఖ్తార్‌పై గ్యాంగ్‌స్టర్ కేసు నమోదైంది. ఈ రెండు కేసుల్లో అన్సారీని కోర్టు 2011, 2023లో నిర్దోషిగా ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో అన్సారీకి 1996లో విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నాయకుడు నందకిషోర్ రుంగ్తా, 2005లో బీజేపీ ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్‌ను హత్య చేసిన కేసులో 10 సంవత్సరాల జైలు శిక్ష పడింది. ముఖ్తార్ అన్సారీ మౌ సదర్ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

ఓడరేవుల్లో మౌలిక సదుపాయాలు మెరుగవ్వాలి

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

చెన్నై: సముద్ర సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలంటే... అంతకన్నా ముందు దేశంలోని ఓడరేవుల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పర్చుకోవాలని, కార్యాచరణ సవాళ్లను భారత్ అధిగమించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు. సముద్ర తీరాన్ని దాటడంపై సంప్రదాయవాద భయాలు మనల్ని చాలా నష్టపరిచినప్పటికీ, భారతదేశం 200 సంవత్సరాల వలసపాలన కాడి నుండి బయటపడవలసి వచ్చిందన్నారు. ఎక్కువగా దేశాభివృద్ధిపైనే దృష్టి సారించి... భూఖండం, సముద్ర అభివృద్ధి పరస్పరం పరిపూరకరమైనవని మరచిపోయిందని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం చెన్నైలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్శిటీ (ఐఎంయూ) 8వ స్నాతకోత్సవంలో ఆమె ప్రసంగించారు. 'బలమైన సముద్ర ఉనికిని పూర్తిస్థాయిలో నెలకొల్పడానికి మనకు ఆర్థిక, పారిశ్రామిక వనరులు కూడా లేవు' అని రాష్ట్రపతి అన్నారు. దేశం సముద్ర రంగ పూర్తి సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకునే ముందు అనేక సవాళ్లను అధిగమించాలని చెప్పారు. ఉదాహరణకు లోతు పరిమితుల కారణంగా చాలావరకు సరకు రవాణాను సమీపంలోని విదేశీ ఓడరేవులకు మళ్లించాల్సి వచ్చిందన్నారు. వర్తక, పౌర నౌకల నిర్మాణ పరిశ్రమలో సమర్థత, అత్యున్నత ప్రమాణాలను లక్ష్యంగా పెట్టుకోవాలని ముర్ము సూచించారు. భారతీయ ఓడరేవుల నిర్వహణ సామర్థ్యం, టర్న్‌అరౌండ్ సమయం ప్రపంచ సగటు బెంచ్‌మార్క్‌లకు సరిపోలాలని తెలిపారు. వార్షిక పోర్ట్ కాల్స్ విషయానికి వస్తే దేశం మొదటి 20 దేశాలలో స్థానం పొందలేదని ఆమె అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 50 అత్యుత్తమ కంటైనర్ పోర్టుల జాబితాలో భారత్‌కు కేవలం రెండు మాత్రమే ఉన్నాయన్నారు. భారతీయ ఓడరేవులు తదుపరి స్థాయికి చేరుకోవడానికి ముందు మౌలిక సదుపాయాలు , కార్యాచరణ సవాళ్లను తప్పక పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు.

నీట్ వ్యతిరేక బిల్లును ఆమోదించండి: రాష్ట్రపతికి స్టాలిన్ వినతి

రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన నీట్ వ్యతిరేక బిల్లుకు ఆమోదం తెలపాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కోరారు. ఐఎంయూ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి చెన్నై వచ్చిన సందర్భంగా ఆమెతో ఈ విషయాన్ని స్టాలిన్ ప్రస్తావించారు. ఈ మేరకు విమానాశ్రయంలో రాష్ట్రపతికి లేఖ అందజేసినట్లు అధికారిక ప్రకటనలో తెలిపారు. 'తమిళనాడు అడ్మిషన్ టు అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ డిగ్రీ కోర్సెస్ బిల్లు, 2021'ను వాస్తవానికి ఆ సంవత్సరం సెప్టెంబర్‌లో తమిళనాడు అసెంబ్లీ ఆమోదించింది. ఆ తర్వాత గవర్నర్ ఆర్ఎన్ రవి దానిని ఆమోదించకుండా తిప్పి పంపారు. అయితే తమిళనాడు ప్రభుత్వం దీనిని ఫిబ్రవరి 2022లో అసెంబ్లీలో మరొకసారి ప్రవేశపెట్టి ఆమోదించింది. రాష్ట్రపతి ఆమోదం కోసం గవర్నర్‌కు మళ్లీ పంపినట్లు స్టాలిన్ ముర్ముకు రాసిన లేఖలో వివరించారు. గవర్నర్ ఇప్పుడు కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు ఈ బిల్లును పంపించారు. అయితే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ బిల్లుపై కోరిన అన్ని వివరణలు రాష్ట్ర ప్రభుత్వం అందించినప్పటికీ ఎటువంటి పురోగతి లేదు. ఈ ఆలస్యం కారణంగా నిరుపేద విద్యార్థులకు అవకాశాలు కోల్పోవడం, అనేక మంది విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొంటూ ఆగస్టు 14, 2023న తాను లేఖ రాశానని... ఆలస్యం చేయకుండా బిల్లుకు ఆమోదం తెలపాలని మిమ్మల్ని కోరానని స్టాలిన్ తన లేఖలో గుర్తు చేశారు. తాజాగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నుండి వచ్చిన ప్రశ్నలకు కూడా సమాధానం ఇచ్చినట్లు రాష్ట్రపతికి ఇచ్చిన లేఖలో స్టాలిన్ తెలిపారు. 'మా బిల్లుకు సమ్మతి మంజూరు చేయడంలో విపరీతమైన జాప్యం వల్ల ఖరీదైన కోచింగ్ భరించలేని చాలా మంది అర్హులైన విద్యార్థులకు మెడికల్ అడ్మిషన్లు లేకుండా పోయాయని పునరుద్ఘాటిస్తున్నాను. కాబట్టి ఈ సున్నిత సమస్యలో మీ తక్షణ జోక్యాన్ని అభ్యర్థిస్తున్నాను. బిల్లుకు వీలైనంత త్వరగా సమ్మతిని తెలపాల్సిందిగా మిమ్మల్ని కోరుతున్నాను' అని స్టాలిన్ ముర్ముకు అందజేసిన లేఖలో పేర్కొన్నారు.

అసోం ప్రభుత్వోద్యోగులకు షాక్

రెండో పెళ్లికి ప్రభుత్వ అనుమతి తప్పనిసరి

గువహటి: అసోం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వోద్యోగులకు దిగ్భ్రాంతి కలిగించే నిర్ణయం తీసుకుంది. జీవిత భాగస్వామి జీవించి ఉండగా ప్రభుత్వ అనుమతి లేకుండా రెండో వివాహం చేసుకోవడానికి వీల్లేదని ప్రభుత్వ ఉద్యోగులకు సర్కార్ కీలక ఆదేశాలు చేసింది. వారి వారి వ్యక్తిగత మతాల అనుమతి ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేనిదే రెండో పెళ్లి చేసుకోవడం కుదరదని తెగేసి చెప్పింది. ఏ మహిళా ప్రభుత్వ ఉద్యోగి కూడా తమ భర్త బతికి ఉండగా ప్రభుత్వ అనుమతి లేకుండా మళ్లీ పెళ్లి చేసుకోకూడదని అసోం ప్రభుత్వం స్పష్టం చేసింది. ముస్లింల ప్రస్తావన లేకుండా, వ్యక్తిగత చట్టం ద్వారా అనేక వివాహాలు చేసుకోవడానికి అనుమతి ఉన్న పురుషులకు కూడా ఈ నిబంధన వర్తిస్తుందని సర్క్యులర్‌లో తెలిపింది, ఈ మేరకు అక్టోబర్ 20న ఆఫీసు మెమోలో రాష్ట్ర ప్రభుత్వం ఈ సూచనలను జారీ చేసింది. ఈ ఉత్తర్వులు తక్షణం అమల్లోకి వస్తాయని ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా బహు భార్యత్వం కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని బీజేపీ నేత, అసోం ముఖ్యమంత్రి హిమాంత బిస్వా శర్మ హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగి మరణానంతరం భర్త పెన్షన్ కోసం ఇద్దరు భార్యలు గొడవపడే సందర్భాలని సీఎం గుర్తు చేశారు. బహుభార్యత్వాన్ని తక్షణమే నిషేధించాలనుకుంటున్నామనే అభిప్రాయాన్ని ఈ ఏడాది ప్రారంభంలో సీఎం వ్యక్తంచేశారు. సెప్టెంబర్‌లో జరిగే అసెంబ్లీ సమావేశాలలో బిల్లును ప్రవేశపెట్టాలని అనుకుంటున్నామని, అనివార్య కారణాల వల్ల అది సాధ్యం కాకపోతే జనవరిలో జరిగే సమావేశాలలో ప్రవేశపెడతామని శర్మ సూచనప్రాయంగా తెలిపారు. ప్రతిపాదిత చట్టంపై ఆగస్టులో ముఖ్యమంత్రి ప్రజాభిప్రాయాన్ని కోరారు. దీంతోపాటు బహుభార్యత్వాన్ని నిషేధించే చట్టం అమలుకు సంబంధించి రాష్ట్ర శాసనసభకున్న అర్హత విషయంలో అసోం ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయగా, దీనికి కమిటీ నివేదిక ఆమోదం లభించినట్టు ప్రభుత్వం తెలిపింది.

రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

నీటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వర్షాకాలం ముగిసి పనుల సీజన్ మొదలైనందున నగరాలు, పట్టణాల్లోని రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలిచ్చారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై సమీక్షలో ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. నగరాల్లో జరుగుతున్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. నీటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని, సముద్రతీరం వెంబడి వస్తున్న పరిశ్రమలు సముద్రపు నీటినే డీ శాలినేషన్ చేసి, వినియోగించేలా చూడాలన్నారు. దీనివల్ల చాలావరకు తాగునీటిని ఆదా చేయగలుగుతామని సీఎం చెప్పారు. విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి, కర్నూలు, కడప, తిరుపతి, గుంటూరు సహా వివిధ కార్పొరేషన్లలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టుల వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు. విశాఖలో నాలుగేళ్లలో రూ.3592 కోట్లతో రోడ్లు, కాలువలు, నీటి సరఫరా, వీధి దీపాలు, పార్కులు, మురుగునీటి శుద్ధి, వివిధ భవనాల నిర్మాణం వంటివి చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అలాగే విశాఖలో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ నిర్వహణ మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎం వారికి సూచించారు. రానురాను జనాభా పెరుగుతున్నందున ప్రజలకు అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు మాట్లాడుతూ నాలుగు ఎకరాలకుపైగా విస్తీర్ణంలో రూ.100 కోట్లతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. రూ.300 కోట్లతో విశాఖలో మౌలిక సదుపాయాల కల్పనకుగాను ప్రాజెక్టు పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. ముడసర్లోవ పార్క్ అభివృద్ధి, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కమర్షియల్ కాంప్లెక్స్, మల్టీ లెవల్ కారు పార్కింగ్, భీమిలి, గాజువాక, అనకాపల్లిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణంతో పాటు వీఎంఆర్డీఏ కింద నడుస్తున్న పనుల గురించి సీఎంకు వివరించారు. విజయవాడలో అభివృద్ధి పనుల పురోగతిని వెల్లడించారు. జగన్ స్పందిస్తూ అంబేద్కర్ స్మృతివనం, కన్వెన్షన్ సెంటర్ పనులు వేగవంతం కావాలన్నారు. ఉద్యానవనాల్లో పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, విజయవాడలో కాల్వలు, వాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇందుకోసం అత్యాధునిక యంత్రాలను వాడాలన్నారు. విజయవాడ విమానాశ్రయానికి వెళ్లే మార్గం సుందరీకరణ, ఇతర పనులను సత్వరమే పూర్తిచేయాలని సీఎం చెప్పారు. విజయవాడ కృష్ణలంక ప్రాంతంలో కృష్ణానది వెంబడి నిర్మించిన రక్షణగోడ వద్ద సుందరీకరణను శీఘ్రంగా పూర్తిచేయాలన్నారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో అభివృద్ధి పనుల గురించీ సీఎం తెలుసుకున్నారు. కంబాల చెరువు సహా వివిధ ప్రాంతాల్లో సుందరీకరణ పనులు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. రాజమహేంద్రవరం హేవ్‌లాక్ బ్రిడ్జి సుందరీకరణ సహా ఇతర ప్రత్యామ్నాయాలపై దృష్టిపెట్టాలని జగన్ వారికి సూచించారు. వరదల కారణంగా నెల్లూరు మునిగిపోయే పరిస్థితులు రాకుండా రక్షణగోడ నిర్మాణం పనులు పూర్తి చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లను ఏర్పాటు చేసి వాటి ద్వారా నిర్వహణ చేయాలని, జగనన్న కాలనీల్లోనూ నీటి సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల్లో పట్టణాభివృద్ధి ప్రాజెక్టుల కోసం అవసరమయ్యే సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు.

రాజమండ్రిలో విశాలాంధ్ర సంవత్సర చందాలు 50 చేర్పింపు

విశాలాంధ్ర–విజయవాడ: పీడిత, తాడిత, కార్మికపక్ష పత్రిక విశాలాంధ్రను ప్రతిఒక్కరు అధ్యయనం చేయాలని తద్వారా సమాజ అభివృద్ధి కోసం పాటుపడాలని సీపీఐ నేతలు కె.నారాయణ, కె. రామకృష్ణ అన్నారు. రాజమండ్రిలో విశాలాంధ్ర సంవత్సర చందాలు 50 చేర్పించిన రాజమండ్రి జట్ల సంఘాన్ని వారు అభినందించారు. శుక్రవారం విజయవాడలో జరిగిన పార్టీ రాష్ట్ర సమితి సమావేశంలో సీపీఐ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు చేతుల మీదుగా 50 సంవత్సర చందాల మొత్తాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథ్ రెడ్డికి అందజేశారు.

ప్రాంతీయ యుద్ధ ఘంటికలు!

కైరో/జెరూసలేం: హమాస్‌ను అంతం చేసేవరకు విశ్రమించబోమంటూ ఇజ్రాయిల్ తీవ్ర రూపంలో గాజాపై విరుచుకుపడుతోంది. వైమానిక దాడులకు తోడు భూతల దాడులకు తెరతీసింది. ఇది చాలదన్నట్లు లెబనాన్, సిరియా, ఈజిప్టు సరిహద్దు ప్రాంతాలపై యుద్ధానికి కాలు దువ్వుతోంది. ఇప్పటికే హెబ్బుల్లాతో నిత్యం తలపడుతున్న ఇజ్రాయిల్ సైన్యం శుక్రవారం రెండు ఈజిప్టు సరిహద్దు పట్టణాలపై క్షిపణలతో దాడి చేసింది. ఎర్ర సముద్ర పరిసర ప్రాంతాల్లో ఇజ్రాయిల్ సైన్యం దాడులకు పూనుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాలు ప్రాంతీయ యుద్ధానికి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నట్లు అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈజిప్టు సైన్యం అధికార ప్రతినిధి కల్నల్ గరీబ్ అబ్దుల్ హఫీజ్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ సరిహద్దులోని తాబా ప్రాంతంలోగల ఆసుపత్రి పక్క భవనంపై పడిందని గుర్తు తెలియని డ్రోన్ కూలిపోగా ఆరుగురికి గాయాలయ్యాయని చెప్పారు. మరో క్షిపణి సరిహద్దుకు 70కిమీల దూరంలోని నువేబా పట్టణంలో ఎలక్ట్రిసిటీ ప్లాంట్ సమీపంలో పడిందని ఇద్దరు ఈజిప్టు భద్రతాధికారులు తెలిపారు. దీని గురించి పూర్తి సమాచారం అందాల్సి ఉందన్నారు. తాబా, నువేబా పట్టణాలు పర్యాటకానికి ప్రసిద్ధి. మరోవైపు ఎర్ర సముద్రం ప్రాంతంలో గగనతలం నుంచి పొంచివున్న ముప్పు గురించి ఇజ్రాయిల్ సైన్యం చెబుతూ మాట్లాడుతోంది. ఈ ప్రాంతం యెమన్ ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటు ప్రాంతం, డ్రోన్ల వినియోగానికి ప్రాచుర్యం పొందింది. 'మాకు అర్థమైనంత వరకు ఈజిప్టులో జరిగిన దాడి ఎర్ర సముద్ర ప్రాంతంలో మేము గుర్తించిన గగనతల ముప్పులో భాగమే' అని ఇజ్రాయిల్ సైన్యం అధికార ప్రతినిధి డానియల్ హగారీ అన్నారు. యుద్ధ హెలికాప్టర్లను గుర్తించినట్లు తెలిపారు. ఎర్ర సముద్ర ప్రాంతం నుంచి పొంచివున్న ముప్పుకు వ్యతిరేకంగా ప్రాంతీయ రక్షణలను పెంచేందుకు అమెరికా, ఈజిప్టుతో కలిసి ఇజ్రాయిల్ పనిచేస్తుందని చెప్పారు. ఇదిలావుంటే, గాజా, ఇజ్రాయిల్‌తో సరిహద్దును పంచుకొనే క్రమంలో ఈజిప్టు కూడా పోరులోకి లాగబడుతోంది. గాజాకు సాయం అందజేయాలని కైరా నొక్కిచెబుతోంది. కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తోంది. బందీల విడుదలకు యత్నిస్తోంది. గత వారం ఇజ్రాయిల్ ట్యాంక్ జరిపిన దాడుల్లో ఈజిప్టు సరిహద్దు సిబ్బంది అనేక మంది గాయపడ్డారు. అయితే ఇది ఉద్దేశపూరిత దాడి కాదని అనుకోకుండా జరిగిందని, దీనికి చింతిస్తున్నామని ఇజ్రాయిల్ క్షమాపణలు చెప్పుకుంది.

19 శాతం పెరిగిన మామిడి ఎగుమతులు

అమెరికాకే అత్యధికం

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఆగస్టు మధ్య కాలంలో భారతదేశ మామిడి ఎగుమతులు 19 శాతం పెరిగి 47.98 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయని వాణిజ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. పరిమాణం పరంగా చూస్తే, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో 22,963.78 టన్నుల నుంచి 27,330.02 టన్నులకు ఎగుమతులు పెరిగాయని పేర్కొంది. ఇందులో అత్యధికంగా అమెరికాకు ఎగుమతి అయినట్లు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో భారత్ 2043.60 టన్నుల మామిడి పండ్లను అమెరికాకు ఎగుమతి చేసిందని, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 19 శాతం పెరిగిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇతర ప్రధాన గమ్య స్థానాలలో జపాన్ (43 టన్నులు), న్యూజిలాండ్ (111 టన్నులు), ఆస్ట్రేలియా (58.42 టన్నులు), దక్షిణాఫ్రికా (4.44 టన్నులు), ఇరాన్, మారిషస్, చెక్ రిపబ్లిక్, నైజీరియా ఉన్నాయి. మామిడి పండ్ల ఎగుమతిని ప్రోత్సహించే చొరవలో భాగంగా వాషి, నాసిక్, బెంగళూరు, అహ్మదాబాద్‌లలోని రేడియేషన్ సౌకర్యాల వద్ద మామిడి పండ్ల ముందస్తు అనుమతి కోసం అమెరికా వ్యవసాయ విభాగం (యూఎస్‌డీఏ), జంతు, మొక్కల ఆరోగ్య తనిఖీ సేవలు (ఏపీహెచ్ఐఎస్) ఇన్‌స్పెక్టర్‌ను కేంద్రం ఆహ్వానించింది. 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఐదు నెలల్లో మామిడి పండ్ల ఎగుమతి 47.98 మిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది అంతకుముందు సంవత్సరాల విలువ అయిన 40.33 మిలియన్ డాలర్లతో పోలిస్తే 19 శాతం అధికం' అని పేర్కొంది. ఆ దేశానికి ఎగుమతి చేయడానికి మామిడి పండ్ల ముందస్తు అనుమతి కోసం దక్షిణ కొరియా నుంచి ఇన్‌స్పెక్టర్లను కూడా ఆహ్వానించినట్లు తెలిపింది. ఇది డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్ అండ్ స్టోరేజ్ (డీపీపీక్యూఎస్) ఇండియా, యానిమల్ అండ్ ప్లాంట్ క్వారంటైన్ ఏజెన్సీ (ఏపీక్యూఏ) దక్షిణ కొరియా సంయుక్త పర్యవేక్షణలో అధీకృత ఆవిరి వేడి చికిత్స సదుపాయంలో శుద్ధి చేసిన తర్వాత 18.43 టన్నుల పండ్లను ఎగుమతి చేయడానికి భారతదేశం అనుమతించింది.

స్వతంత్ర పలస్తీనానే మేము కోరేది

- ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు ఖండన
- గాజా ప్రజలకు ఏఐటీయూసీ సంఘీభావం
- పలస్తీనా రాయబారి అద్నాన్‌తో అమర్‌జిత్ కౌర్ భేటీ

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని, గాజాలో మారణహోమం సృష్టిస్తోందని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) వ్యాఖ్యానించింది. స్వతంత్ర పలస్తీనాకు మద్దతిస్తున్నట్లు తెలిపింది. మానవాళికి వ్యతిరేకమైన ఇజ్రాయిల్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ అన్నారు. కౌర్ నేతృత్వంలో కార్మిక నేతల బృందం శుక్రవారం పలస్తీనా రాయబారి అద్నాన్ మహమ్మద్ జుబేర్ హైజాతో న్యూఢిల్లీలోని దౌత్యకార్యాలయంలో సమావేశమై పలస్తీనా ప్రజలకు 1.2 కోట్ల మంది కార్మికుల తరఫున సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో అండగా నిలుస్తామని హామీనిచ్చారు. పలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ అమానవీయ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని కౌర్ తెలిపారు. తూర్పు జెరూసలేం రాజధానిగా స్వతంత్ర పలస్తీనా ఏర్పాటుకు ఏఐటీయూసీ మద్దతిస్తున్నట్లు వెల్లడించారు. గాజాపై దాడులు తక్షణమే నిలిపివేసేందుకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. పలస్తీనా ప్రజల స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, స్వయం ప్రతిపత్తి హక్కుల పరిరక్షణ, గాజాలో శాంతి నెలకొల్పేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐక్యరాజ్య సమితికి ఏఐటీయూసీ కోరుతోందన్నారు. 'ఇజ్రాయిల్‌కు మద్దతుగా సామ్రాజ్యవాద దేశాలు నిలవడాన్ని ఆక్షేపిస్తున్నాం. గాజాపై బాంబులు కురిపిస్తూ మారణహోమం సృష్టిస్తూ యుద్ధ నేరాలకు ఇజ్రాయిల్ పాల్పడుతోంది. పలస్తీనా ప్రజలను వారి సొంత భూముల నుంచి వెళ్లగొడుతోంది. 1948 నుంచి ఇజ్రాయిల్ సైనిక దురాక్రమణను కొనసాగిస్తోంది. గాజాపై దండయాత్ర చేస్తోంది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తోంది. ఉత్తర గాజా, సెంట్రల్ గాజాను వీడాలని పలస్తీనా ప్రజలకు ఇజ్రాయిల్ సైన్యం ఆదేశాలివ్వడం 1948 నాటి నక్బాను గుర్తుచేసింది. నాటి పోరులో 15 వేల మంది పలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి, ఆహారం, మంచినీళ్లు అందకుండా చేసి, ఆసుపత్రులపై సైతం బాంబులు విసిరి, నిస్సహాయ ప్రజలపై ప్రతాపం చూపుతూ పైశాచికత్వాన్ని ఇజ్రాయిల్ ప్రదర్శిస్తోంది. ఇజ్రాయిల్ రాక్షస క్రీడను, చట్టవిరుద్ధ, అమానవీయ కార్యకలాపాలను, కర్కశ ఉగ్రవాదాన్ని అంతర్జాతీయ సమాజం తీవ్రస్థాయిలో ఖండించాలి. ప్రపంచ కార్మికులు డబ్ల్యూఎఫ్‌టీయూ బ్యానర్ కిందకు వచ్చి పలస్తీనాకు అండగా నిలవాలి' అని అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు.

మేమొస్తే ఓపీఎస్ పునరుద్ధరిస్తాం

విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు ఇస్తాం
ఆంగ్ల విద్య అందిస్తాం

జైపూర్: రాజస్థాన్‌లో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతే పాత పింఛన్ పథకాన్ని (ఓపీఎస్) పునరుద్ధరిస్తామని, దానిని భవిష్యత్‌లో రద్దు చేసే వీల్లేకుండా చట్టం తెస్తామని ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ ప్రకటించారు. అలాగే ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు లేక టాబ్లెట్‌లు అందజేస్తామని, ఆవుపేడ కొనుగోలు చేస్తామని, ఇంగ్లీషు మీడియం స్కూళ్లు నెలకొల్పుతామని హామీలిచ్చారు. నవంబరు 25న రాజస్తాన్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఇదే క్రమంలో గెహ్లాత్ శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరిగి అధికారంలోకి వస్తామని దీమాగా చెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో పాఠశాల విద్య, కేజీ రూ.2లెక్కన ఆవుపేడను 'గోధన్ పథకం' కింద కొనుగోలు, సహజ విపత్తులకు రూ.15లక్షల బీమా కల్పన వంటి హామీలను రాష్ట్ర ప్రజలకు ఇచ్చారు. ప్రభుత్వ కాలేజీల్లో చేరే మొదటి సంవత్సరం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు లేక ట్యాబ్లెట్‌ను అందజేస్తామ న్నారు. 1.05 కోట్ల కుటుంబాలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్లు, కుటుంబంలో మహిళా పెద్దకు గౌరవంగా ఏటా రూ.10వేలను విడతలవారీ చెల్లింపు హామీలను కాంగ్రెస్ ఇంతకుముందే ఇచ్చింది. కాగా త్వరలోనే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల కాబోతోందని, అందులో మరికొన్ని హామీలు ఉంటాయని గెహ్లాత్ వెల్లడించారు.

రాజకీయ అస్త్రాలుగా దర్యాప్తు సంస్థలు

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని కేంద్రప్రభుత్వం దుర్వినియోగిస్తోందని గెహ్లాత్ విమర్శించారు. 'దేశంలో కుక్కల కంటే ఈడీ హడావిడి ఎక్కువైందని ఓ సీఎం (భూపేశ్ బాఘెల్) వ్యాఖ్యానించారు. దీని కంటే దురదృష్టకరం ఏముంటుంది? ఆయన వ్యాఖ్యల్లో ఎంత బాధ దాగివుందో మీరు అర్థం చేసుకోగలరు. దర్యాప్తు సంస్థలు రాజకీయ అస్త్రంగా మారారు. మోదీజీ! మీకు అర్థంకావడం లేదేమోగానీ మీ కౌంట్‌డౌన్ మొదలైంది' అని గెహ్లాత్ వ్యాఖ్యానించారు. గురువారం కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోత్సర ఆస్తులను ఈడీ సోదా చేయడాన్ని ప్రస్తావిస్తూ బీజేపీకి వ్యతిరేకంగా గొంతెత్తినందుకే కాంగ్రెస్ నేత... ఈడీకి లక్ష్యంగా మారారని గెహ్లాత్ అన్నారు.

రేషన్ కుంభకోణం... ఈడీ అదుపులోకి బెంగాల్ మంత్రి

ఇది నాపై బీజేపీ కుట్ర: జ్యోతిప్రియా మల్లిక్

కోల్‌కతా: కోట్ల రూపాయాల రేషన్ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో పశ్చిమ బెంగాల్ మంత్రి జ్యోతిప్రియా మల్లిక్ అరెస్టు అయ్యారు. కోల్‌కతా శివార్లలోని సాల్ట్ లేక్ ప్రాంతంలోని ఇంటి నుంచి ఆయనను శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అంతకుముందు సుమారు 17–18 గంటలు విచారించారు. మల్లిక్‌కు మధుమేహంతో పాటు అనేక ఆరోగ్య సమస్యలు ఉండటంతో దక్షిణ కోల్‌కతా, జోకా ప్రాంతంలోని ఈఎస్ఐ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించినట్లు ఈడీ అధికారి ఒకరు చెప్పారు. మూడు గంటల వైద్య పరీక్షల తర్వాత బ్యాంక్‌షాల్ కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మంత్రి కస్టడీని కోరినట్లు వెల్లడించారు. మల్లిక్ గురువారం తమ విచారణకు సహకరించలేదన్నారు. అధికారుల ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు చెబుతూ అనారోగ్యంగా ఉన్నందున ప్రశ్నలను ఎదుర్కోలేకపోతున్నట్లు పదేపదే చెప్పారని అధికారి తెలిపారు. 'రేషన్ కుంభకోణానికి సంబంధించిన అనేక ప్రశ్నలకు ఆయన నుంచి సమాధానాలను రాబట్టాల్సి ఉంది. రేషన్ పంపిణీలో జరిగిన అవకతవకలలో ఆయనకు ప్రమేయం ఉంది' అని ఈడీ అధికారి అన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రిగా పని చేస్తున్నప్పుడు కొన్ని కోట్ల రూపాయల సరకును పక్కదారి పట్టించారని మల్లిక్‌పై ఆరోపణలు ఉన్నట్లు ఈడీ తెలిపింది. రేషన్ బియ్యం, గోధుమలను బహిరంగ మార్కెట్‌లో అక్రమంగా విక్రయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారవేత్త బాకీబుర్ రెహమాన్‌ను ఈడీ ఇటీవల అరెస్టు చేసింది. మల్లిక్‌కు రెహమాన్ సన్నిహితుడని పేర్కొంది. అరెస్టు క్రమంలో మల్లిక్ మాట్లాడుతూ బీజేపీ తనపై పెద్ద కుట్ర చేస్తోందని, ఇందులో సువేందు అధికారి హస్తం ఉందని ఆరోపించారు. మమ్మల్ని కేసుల్లో ఇరికించాలని బీజేపీ యత్నిస్తోందన్నారు. మల్లిక్ ప్రస్తుతం అటవీ శాఖ మంత్రిగా ఉన్నారు. గురువారం మల్లిక్ ఆస్తులను ఈడీ సోదా చేసింది. సెంట్రల్ కోల్‌కతాలోని ఆమ్‌హెస్ట్ వీధిలోని ఆయన పూర్వీకుల ఇంటిలోనూ తనిఖీలు చేపట్టింది.

బీజేపీది కక్షసాధింపు: టీఎంసీ

అనారోగ్యంగా ఉన్న మల్లిక్‌ను విచారణకు తీసుకెళ్లడంపై ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయనకు ఏమైనా జరిగితే పోలీసు కేసు పెడతామని హెచ్చరించారు. మల్లిక్ ఆరోగ్యం బాగోలేదని, మధుమేహం అదుపులో లేదని చెప్పినా అరెస్టు చేయడాన్ని ఖండించారు. మల్లిక్‌కు జరగరానిది జరిగితే బీజేపీ, ఈడీలపై కేసులు పెడతామన్నారు. బీజేపీది నీచమైన రాజకీయ క్రీడగా విమర్శించారు. ప్రతిపక్ష నేతలే లక్ష్యంగా ఈడీతో దాడులు చేయిస్తోందని మమత ఆరోపించారు. నారద, శారద కుంభకోణాల్లో ఆరోపణలు ఎదుర్కొన్న సువేంధు అధికారి వంటి బీజేపీ నేతల విషయంలో సీబీఐ, ఈడీ ఎందుకు మౌనం వహిస్తున్నాయని టీఎంసీ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ ప్రశ్నించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు బీజేపీ కోసం పనిచేస్తున్నట్లు ఉందని విమర్శించారు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న సమయంలో ఇలాంటి చర్యలు ద్వారా భయపెట్టాలని బీజేపీ చూస్తోందని, టీఎంసీ నేతలు భయపడరని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయ్ ప్రకాశ్ మజుందార్ అన్నారు.

ఊహించినదే : బీజేపీ

మల్లిక్ అరెస్టు ఊహించినదేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామిక్ భట్టాచార్య అన్నారు. ఆయన సహచరుల నుంచి అవకతవకలు జరిగినట్లు తెలియడంతో మంత్రి అరెస్టులో ఆశ్చర్యం లేదన్నారు. టీఎంసీ అవినీతిలో కూరుకుపోయి ఉందని మరోమారు రుజువు అయిందని వ్యాఖ్యానించారు. సువేంధు అధికారి ఎక్స్ మాధ్యమంగా స్పందిస్తూ 'ఇకపై జైల్లో రాష్ట్ర కేబినెట్ జరుగుతుంది' అని ఎద్దేవా చేశారు.

గాజా ప్రజలకు రక్షణ ఎక్కడ?

ఇజ్రాయిల్ భూతల దాడిపై ఐరాస –
50 బందీల మృతి : హమాస్ ప్రకటన

జెరూసలేం: గాజాపై ఇజ్రాయిల్ భూతల దాడులు ప్రారంభించడంపై ఐక్యరాజ్య సమితి తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తంచేసింది. ఇక్కడి ఏ ప్రాంతం పౌరులకు సురక్షితం కాదని పేర్కొంది. మారణహోమాన్ని ఆపాలని ఇజ్రాయిల్‌కు హితవు పలికింది. ఇదే కొనసాగితే జరిగే ప్రాణ నష్టం అంచనాలకు మించిపోతుందని హెచ్చరించింది. 'గాజాలో అన్ని సేవలను నిలిపివేయడం, నిత్యావసరాలను ఆపేయడంతో ఆ ప్రాంత ప్రజలు అల్లాడిపోతున్నారు. మురికినీరు వీధుల్లో పారుతోంది. మనం ఇక్కడ మాట్లాడుకుంటుండగానే అక్కడ జనం బాంబులు, భూతల, వైమానిక దాడులలో చనిపోతున్నారు' అని పలస్తీనా శరణార్థుల కోసం ఐరాస సంస్థ కమిషనర్ జనరల్ ఫిలిప్ లజ్జారిని ఆందోళన వ్యక్తంచేశారు. ఐరాస మానవతావాద సమన్వయకర్త లిన్నే హేస్టింగ్స్ స్పందిస్తూ గాజా ప్రజలకు ఎక్కడా రక్షణ లేదని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఇజ్రాయిల్ సైన్యం హెచ్చరించినప్పటికీ సేఫ్ జోన్లలోనూ దాడులు జరుగుతున్నాయన్నారు. ముందస్తు హెచ్చరికలు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదన్నారు. తరలింపు మార్గాలపై దాడులకు పాల్పడితే ప్రజలకు రక్షణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గాజాలో ఎక్కడా ప్రజలు సురక్షితంగా లేరని ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల7వ తేదీ నుంచి 57 మంది వర్కర్లను ఐరాస కోల్పోయిందన్నారు. గాజాకు మానవతా సాయాన్ని నిరంతరాయంగా చేరనివ్వాలని ఫిలిప్ సూచించారు. ఇదిలావుంటే ఇజ్రాయిల్ భూతల దాడుల్లో తమ వద్ద బందీగా ఉన్నవారిలో 50 మంది చనిపోయినట్టు హమాస్ ప్రకటించింది. రాత్రిపూట సొరంగాల్లోకి ట్యాంకులు, దళాలు, సాయుధ బుల్డోజర్లు పంపి అనేక ప్రాంతాలలో ఇజ్రాయిల్ విధ్వంసం సృష్టించినట్లు వెల్లడించింది. గాజా స్ట్రిప్‌లో ఇజ్రాయిల్ దాడులు, ఊచకోతల ఫలితంగా మరణించిన బందీల సంఖ్య దాదాపు 50కి చేరుకుందని హమాస్ తన టెలిగ్రామ్ ఛానెల్‌లో ఓ ప్రకటన చేసింది. మూడు వారాల నుంచి ఇజ్రాయిల్ సైన్యం బాంబులు, వైమానిక దాడులతో గాజాపై విరుచుకుపడుతోంది. ఇప్పటి వరకూ ఏడు వేల మంది పలస్తీనా ప్రజలు మరణించినట్టు గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది. గాయపడినవారి సంఖ్య 10 వేలు దాటినట్టు వెల్లడించింది. శిథిలాల కింద 1,650 మంది వరకు ఉండవచ్చని అంచనా వేసింది. గాజాలోకి మానవతా సాయాన్ని అనుమతించాలని, పౌరుల కష్టాలను నివారించాలని, దాడులను విరమించుకోవాలని అరబ్ నేతలు ఉమ్మడిగా ఇజ్రాయిల్‌కు విజ్ఞప్తి చేశారు. దాడులు కొనసాగితే ప్రాణనష్టం తీవ్రంగా ఉంటుందని అంతర్జాతీయ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇదిలావుంటే భూతల దాడిలో హమాస్ లక్ష్యాలను నాశనం చేశామని, యాంటీ ట్యాంక్ క్షిపణి లాంచ్ పోస్టులను ధ్వంసం చేశాయని ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. హమాస్ వద్ద ఇంకా 229 మంది బందీలు ఉన్నట్లు వెల్లడించింది.

పార్లమెంటు ఎన్నికల వరకూ మార్చొద్దు

గవర్నర్‌పై తమిళనాడు సీఎం వ్యంగ్యం

చెన్నై: పెట్రోల్ బాంబ్ వ్యవహారం రాజ్‌భవన్‌కు, తమిళనాడు ముఖ్య మంత్రి ఎంకే స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వానికి మధ్య తిరిగి చిచ్చు రేపుతోంది. డీఎంకేకు, గవర్నర్ ఆర్ఎన్ రవి మధ్య ఇప్పటికే అనేక సందర్భాల్లో ఉప్పునిప్పు తరహా వాతావరణం నెలకొంది. తాజాగా పెట్రోల్ బాంబు అంశంపై తమ ఫిర్యాదును స్థానిక పోలీసులు నమోదుచేయలేదని రాజ్ భవన్ ఆరోపించడంతో గవర్నర్‌పై స్టాలిన్ శుక్రవారం ఎదురుదాడి చేశారు. పార్లమెంటరీ ఎన్నికల వరకూ ఆయనను (గవర్నర్) ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా మార్చవద్దంటూ వ్యంగ్యోక్తులు విసిరారు. "ఆయన అబద్ధాల పుట్ట. ద్రవిడం ఏమిటని ప్రశ్నించిన ఆయన వల్ల మాకు ఎన్నికల పరంగా లబ్ధి చేకూరుతుంది. గత రెండు రోజులుగా ఆయన (గవర్నర్) ఎలాంటి అబద్ధాలు చెబుతున్నారో మీకందరికీ తెలిసిందే. నా వరకూ చెప్పాలంటే ఆయన అబద్ధాలు చెబుతుంటారు. ద్రవిడం అంటే ఏంటని ప్రశ్నిస్తుంటారు. ఆయనను కనీసం వచ్చే పార్లమెంటు ఎన్నికల వరకైనా మార్చవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధానిని, హోం మంత్రి అమిత్‌ను నేను కోరుతున్నాను" అని ఒక వార్తా సంస్థతో మాట్లాడుదూతూ స్టాలిన్ అన్నారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.